జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 24 జూలై 2026 | సంపుటి: 19 | సంచిక: 139 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , ఆషాఢ మాసము , తిథి: దశమి - 09:14:49 వరకు నక్షత్రంఅనూరాధ - 28:37:25 వరకు కరణంగర - 09:14:49 వరకు, వణిజ - 22:24:52 వరకు పక్షంశుక్ల యోగంశుక్ల - 20:11:13 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## నేటి తరానికి తగ్గుతున్న ఓపిక

**హనీమూన్ మర్డర్ ఘటనే నిదర్శనం**

**సోనమ్ బెయిల్ రద్దు చేసిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ,జూలై23(ప్రజాజ్యోతి): సమాజం అనేక మార్పులకు లోనవుతున్న కారణంగా హనీమూన్ మర్డర్ లాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయని సుప్రీం కోర్టు తాజాగా వ్యాఖ్యానించింది. గతేడాది హనీమూన్ సందర్భంగా భర్తను హత్య చేసిన సోనమ్ రఘువంశీ

## సాధ్యమైనంత త్వరగా ఉద్యమకారుల గుర్తింపు

కమిటీ చైర్మన్ కె కేశవరావు వెల్లడి

హైదరాబాద్,జూలై23(ప్రజాజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను సాధ్యమైనంత త్వరగా గుర్తించి.. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆ గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావు వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. 16 రోజులు

మిగతా 2లో..



# వాయిదా పర్వం

## పార్లమెంటులో ప్రతిష్టంభన

- నీట్ లీకేజీపై చర్చపై కుదరని ఏకాభిప్రాయం
- ధర్మేంద్ర రాజీనామా చేయాల్సిందేనని పట్టు
- విపక్షాల పట్టుతో పార్లమెంట్ నేటికి వాయిదా
- పార్లమెంట్ వెలుపల పరస్పర నినాదాలు
- విద్యార్థుల భవిష్యత్ నాశనం చేసిందే బిజెపి
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- మోడీ ట్వీట్‌పై రాహుల్, అభిజిత్ దీప్కె



న్యూఢిల్లీ,జూలై23(ప్రజాజ్యోతి): పార్లమెంటులో ప్రతిష్టంభన కొనసాగుతోంది. గురువారం ప్రారంభమైన రెండు నిముషాలకే ఉభయసభలు తొలుత 12గంటలకు వాయిదా పడ్డాయి. అనంతరం సమావేశమైనా సభలు సాగలేదు. ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేస్తేనే చర్చకు అంగీకరిస్తామని రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే తెగేసి చెప్పారు. నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేటికి వాయిదా పడింది. రాజ్యసభను కూడా మధ్యాహ్నం మూడు గంటల వరకూ వాయిదా పడింది. నీట్ పేపర్ లీక్ ఉదంతానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం ప్రారంభించాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని పట్టుబట్టాయి. ఈ క్రమంలో మిగతా 2లో..

## పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టు

- ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోడీ
- విద్యార్థులతో చర్చలకు మేం సిద్ధం
- ఎప్పుడైనా..ఎక్కడైనా చర్చిద్దాం రండి
- సందేశం పంపిన కేంద్రమంత్రి జితేంద్రసింగ్



న్యూఢిల్లీ,జూలై23(ప్రజాజ్యోతి): నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన భారీ నిరసనల నేపథ్యంలో ప్రధాని మోదీ ఎట్టకేలకు స్పందించారు. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రధాన మంత్రి ఎక్స్ వేదికగా తెలిపారు. పేపర్ లీక్ ఘటనల్లో ప్రమేయం ఉన్నవారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూసేందుకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ విషయంలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలను మిగతా 2లో..

## నేడు దేశవ్యాప్త ఆందోళనలు

- కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు
- శాంతియుతంగా నిరసనలు తెలపాలని సూచన
- సీజేపీ ఆందోళనలపై పోలీసుల దృష్టి
- హింసాత్మక ఘటనలపై పోలీసుల కూపీ
- అవసరమైతే పాస్‌పోర్టులు రద్దుకు సిద్ధం?

న్యూఢిల్లీ,జూలై23(ప్రజాజ్యోతి): నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత వహించాలంటూ ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) 24న శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఇటీవలి జంతర్‌మంతర్-పార్లమెంటు ర్యాలీ సందర్భంగా యువతపై పోలీసుల కర్కశత్వాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసనకు పిలుపునిచ్చినట్టు తెలిపింది. ఈ కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు, ఇతర మిగతా 2లో..

### గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్

# బినామీ సంస్థ

## గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది బలి

- పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది
- గ్లోబరీనా తప్పిదాలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి
- బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండూ ఒక్కటే
- సర్ ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ ఓట్లు తొలగించే కుట్ర
- అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం
- ఓటు లేకపోతే పథకాలు పోతాయని హెచ్చరిక
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,జులై 23(ప్రజాజ్యోతి): గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరోపించారు. గురువారం మీడియాతో నిర్వహించి చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని.. ఆ సంస్థ పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యాఖ్యానించారు. వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందన్నారు. గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. మిగతా 2లో..

## తెలంగాణ శాసనసభకు ఆధునిక హంగులు

**ఆధునీకరణ పనులు పరిశీలించిన సీఎం రేవంత్**

హైదరాబాద్,జూలై23(ప్రజాజ్యోతి): తెలంగాణ శాసనసభ భవనంలో కొనసాగుతున్న మరమ్మతు పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచిన శాసనసభ ప్రాంగణాన్ని మరింత మెరుగైన మౌలిక సదుపాయాలతో మిగతా 2లో..

## గ్లోబరీనా సంస్థతో నాకు సంబంధం లేదు

- క్షమాపణలు చెప్పకుంటే లీగల్ చర్యలు
- రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ హెచ్చరిక
- గ్లోబరినాతో మీరెందుకు ఒప్పందం చేసుకున్నారు
- పగలు కాంగ్రెస్, రాత్రి బిజెపితో రేవంత్ సావాసం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్,జూలై23(ప్రజాజ్యోతి): 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడిందని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ముఖ్యమంత్రి హోదాకు తగిన విధంగా ఒక్కసారైనా వ్యవహరించాలని సూచించారు. పేపర్ లీక్ వంటి అత్యంత దురదృష్టకర ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ తప్పుడు ప్రచారం చేయడం ముఖ్యమంత్రి పదవికే మచ్చ తెచ్చే చర్య అని ఆయన ఆరోపించారు. గ్లోబరీనా సంస్థతో బీఆర్ఎస్‌కు, తన కుటుంబానికి లేదా మిగతా 2లో..

## యువత గొంతు నొక్కితే పతనం తప్పదు

బిజెపికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక

హైదరాబాద్,జూలై 23(ప్రజాజ్యోతి): యువత గొంతు నొక్కితే బీజేపీ రాజకీయ పతనం తప్పదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరని.. రాజ్యాంగాన్ని అణచలేరన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం మిగతా 2లో..

## డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

**సర్వీస్ తుపాకీతో కాల్చుకున్నట్లు గుర్తింపు**

**సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు**



హైదరాబాద్,జూలై23(ప్రజాజ్యోతి): నగరంలో కానిస్టేబుల్ ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ స్వామి తన సర్వీస్ తుపాకీతో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం తెల్లవారుజామున 5:30 గంటల ప్రాంతంలో వాష్‌రూమ్‌లో స్వామి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్వామి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఘటనా స్థలిలో కానిస్టేబుల్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం మిగతా 12లో..

## కాంగ్రెస్, కమ్యూనిస్టుల జంతర్ మంతర్ రాజకీయాలు

- గతంలో లీక్ అయితే కాంగ్రెస్ నేతలు రాజీనామా చేశారా
- టెన్త్ లీకేజీలో రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు
- కేంద్రమంత్రి మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు



న్యూఢిల్లీ,జూలై23(ప్రజాజ్యోతి): జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష మిగతా 2లో..



### మహానగరం నడిబొడ్డున

# పేదోడికి ఇల్లు ఉండొద్దా

- పేదలకు ఇళ్లు కడితే.. ఎందుకంత కడుపుమంట?
- పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే విష ప్రచారమా?
- కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు వాటా ఇస్తే తప్పా?
- రూ. 60 లక్షల విలువైన ఇంటిని ఇస్తుంటే బీఆర్ఎస్ కు కడుపుమంట
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను దగా చేసింది బీఆర్ఎస్
- ఇండ్ల కేటాయింపులో బడుగు బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు
- బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



హైదరాబాద్,జూలై 23(ప్రజాజ్యోతి): హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవ ప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర మిగతా 2లో..

## ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

### అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష
### కార్యాచరణతో ముందుకు సాగాలని సూచన

సిద్దిపేట,జూలై23(ప్రజాజ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. దీనినుంచి బయటపడేలా కార్యాచరణతో సాగాలని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఐఓసీ కార్యాలయంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై మంత్రి మిగతా 12లో..



# సంపాదకీయం

## యువత ఆక్రోశానికి.. సమాధానమేదీ?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. వరుసగా నాలుగోరోజు కూడా ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. సమావేశాలు సజావుగా సాగడం లేదు. నీట్ లీకేజీపై ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు దిగింది. నీట్ లీకేజీకి బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంసద్ చలో ఆందోళనకు పిలుపునిచ్చింది. వారి ఆందోళనలో వందశాతం న్యాయం ఉంది. ఎందుకంటే పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు...పాలకులు అయినప్పుడు ప్రజలు స్పందిస్తారు. నిలదీస్తారు. నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరోగళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదండ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావించి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య. ఇకపోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోడీ మౌనం వీడడం లేదు. కేవలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. దేశంలో ఓ పెద్ద ఆందోళన జరుగుతంటే ఇదేనా ప్రధానిగా ఉన్న వ్యక్తి చేయాల్సిన పని. మణిపూర్ అల్లర్లు, ఢిల్లీలో రైతుల ఆందోళన, నీట్ పరీక్షా పేపర్ లీకేజీ, అయోధ్య విరాళాల చోరీ..ఇటీవల వరుసగా జరిగిన సంఘటనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటిపై పార్లమెంటులో చర్చించడం జరగాలి. ప్రధాని మోడీ మౌనం వీడి పార్లమెంట్‌కు వచ్చి, నేరుగా సమాధానం చెప్పాల్సిన ముఖ్యమైన అంశాలు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను మౌనమునిగా విమర్శించిన మోడీ ఇప్పుడు అంతకు మించి మౌనంగా మారారు. పార్లమెంట్ జరుగుతన్నా రాకుండా చోద్యం చూస్తూ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం సరికాదు. ఇక్కడ సమాధానం చెప్పడం అంటే దేశప్రజలకు సమాధానం చేరవేయడంగా గుర్తించాలి. బాధ్యతగల ప్రధానిగా మోడీ పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఆయన వందిమాగధులు ఇదంతా విపక్షాలతో తమకున్న పంచాయితీలాగా సవాళ్లు విసరుతున్నారు. దేశం తీవ్ర ఆందోళనలో ఉంటే ఇదేనా పాలక పార్టీ వ్యవహరించే తీరు. ఇకపోతే దేశంలోని వ్యవస్థల్లో అవినీతి పాతుకుపోయిందనడానికి నీట్ పేపర్ లీకేజీ వంటివి పరాకాష్టగా చూడాలి. అవినీతి అన్నది రాజకీయ నాయకుల హక్కుగా మారింది. ప్రజలను ఏమార్చి, అధికారం చేపట్టగానే, ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప దేశహితం, దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అసవరమైన నిర్ణయాలు తక్కువే జరుగుతున్నాయి. ఇటీవల రామమందిరంలో విరాళాల చోరీ ఘటన తెలిసిందే. అవినీతి కేసుల్లో దోషులకు మరణశిక్ష విధించాలి. అవినీతి సాధారణమేనని సగటు భారత పౌరులు ఆలోచించే పరిస్థితి నెలకొన్నది. దొరికే వరకు కూడా ఇది తప్పు అని కూడా భావించడంలేదు. వ్యవస్థలో అవినీతిని రూపుమాపాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని సవరించాలి. దోషులకు మరణ శిక్ష విధించేలా మార్పులు చేయాలి. ఉన్న చట్టాలతోనే కఠిన శిక్షలు విధించాలి. ఇకపోతే దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం సున్నా అని ధ్వజమెత్తారు. నిజంగానే ఇది ముమ్మాటికీ నిజం. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ముందే ప్రధాని మోడీ పార్లమెంటులో స్పందించి ఉంటే ఈ గందరగోళం చెలరేగేది కాదు. ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడడం, విపక్షాలను తిట్టిపోయడం వల్ల సమస్యలను పాలకులు గుర్తించడం లేదు. ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. అక్రమాలు, లీకేజీలకు నిలయంగా మారింది. దేశంలో పేపర్ లీకేజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయి. దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూ వస్తోంది. జంతర్ మంతర్ వద్ద భారతీయ యువత నిరసనలను సీరియస్‌గా తీసుకోవాల్సి ఉండగా, దానిని అణచివేయడం ఎలా అన్న ఆలోచననే అధికారపక్షం ఆలోచన చేయడం సరికాదు. నిరసనల్లో లక్ష మందికి పైగా యువకులు, విద్యార్థులు పాల్గొని ఉంటారని ఫోటోలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. ఎంతోకాలంగా ఆగ్రహంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని అనుకూలంగా తీసుకుని, వెల్లువెత్తి జనసంద్రంగా మారినట్లు మనకు కనిపిస్తోంది. మన దేశంలో రాజకీయ పార్టీల ర్యాలీలకు డబ్బులు, ఇతర ప్రలోభాలతో జనాన్ని సమీకరించడం పరిపాటి. అయితే ఈ నిరసన ప్రదర్శన అలా జరగలేదు. జంతర్ మంతర్‌కు చేరిన వారందరూ తమకు తాముగా స్వచ్ఛందంగా వచ్చినవారే. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలలో విజ్ఞప్తులకు ప్రతిస్పందించి స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవరి ప్రయాణ ఏర్పాట్లు వారే చేసుకుని, సుదూర ప్రాంతాల నుంచి నడిచి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఇంకో ముఖ్య విషయమేమంటే వచ్చిన వారిలో యువ మహిళల శాతం అత్యధికంగా ఉండడం. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారిలో అత్యధికులు ఇటువంటి నిరసనలలో తొలిసారి పాల్గొన్నవారే కావడం మరో వాస్తవం. కేవలం నీట్ తదితర ప్రశ్నపత్రాల లీక్‌కు రగిలిపోయి మాత్రమే యువత జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రాలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చరిల్లు తోన్న నిరుద్యోగం, అవినీతిమయమైన అధికార వ్యవస్థలు, రాజకీయ పార్టీల కపటాలు అన్నీ కలగలిపి వారిని ఈ నిరసనలో పాల్గొనేలా ప్రోత్సహించాయనే చెప్పాలి. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితిమీరి, రాజకీయ అవినీతి పెరిగి పోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు. దీనికి విదేశీ హస్తం ఉందనో లేదా మరే ఇతర కారణాలనో చూపి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కూడా మంచిది కాదు. సమస్యలను గుర్తించి పాలకలు తమ తీరును మార్చుకోవాలి. ఇది కేంద్ర రాష్ట్రాల పాలకలుకు ఓ హెచ్చరిక కావాలి. అలాగే ఈ యువ నిరసన ఒక ఆరంభం మాత్రమే. ఇది దావానలంలా విస్తరించినా ఆశ్చర్య పోనవసరం లేదు. పాలకులు బుద్ధి తెచ్చుకుని మారకపోతే యువత చరిత్ర సృష్టిస్తుందని చెప్పక తప్పదు.

## యువత గొంతు నొక్కితే పతనం తప్పదు

మొదటిపేజీ తరువాయి..

చెప్పకుండా నిర్భంధాలు సరికాదని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతకు లాఠీలు, కేసులే బీజేపీ సమాధానమన మంటూ విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కే అని చెప్పుకొచ్చారు. విద్యార్థుల స్వరాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ముప్పని వ్యాఖ్యానించారు. యువత భవిష్యత్తుపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. విద్యార్థుల మధ్య నిలిచిన రాహుల్ గాంధీ నిజమైన ప్రజానాయకుడన్నారు. ప్రజల



మధ్య ఉండే నాయకత్వానికే దేశం మద్దతిస్తుందని తెలిపారు. భయపెట్టి ప్రజల స్వరాన్ని శాశ్వతంగా అణచలేరని అన్నారు. విద్యార్థుల కలలను సంకెళ్లతో బంధించలేరని స్పష్టం చేశారు. యువత ఆశయాలను జైళ్ల గోడల మధ్య నిర్బంధించలేరన్నారు. రాజ్యాంగాన్ని ఎవరూ ఓడించలేరని.. రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ చారిత్రక బాధ్యత అని వెల్లడించారు. 'యువత విద్వేషం కాదు... విశ్వాసం కోరుకుంటోంది. అహంకారం కాదు... జవాబుదారీతనం కోరుకుంటోంది. ప్రచారం కాదు... పారదర్శక పాలననే యువత కోరుకుంటోంది' అంటూ వ్యాఖ్యానించారు.

2029 ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణకు కీలకమని ఉత్తమ్ వెల్లడించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రత్యామ్నాయం అందిస్తోందన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన అందిస్తోందని తెలిపారు. ప్రజల గొంతు వినే ప్రభుత్వాలే చరిత్రలో నిలుస్తాయన్నారు. 'భారత్‌ను భయంతో కాదు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో నడపాలి' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

### గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్

# బినామీ సంస్థ

మొదటిపేజీ తరువాయి..

ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసిరారు. హరీశ్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని... మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. సర్ నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. సర్ ఉద్దేశం ప్రక్షాళన అని.. కుట్ర పూరితంగా సర్‌ను వాడుతున్నారని ఆరోపించారు. సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే అని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే.. కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అని అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'ఓటుహక్కు లేకపోతే పథకాలు పోతాయి.. ఓటుహక్కు లేకపోతే ఆధార్ పోతుంది. ఓటుహక్కు లేకపోతే గుర్తింపే ఉండదు... ఓటుహక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు.

బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. 'మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎస్ఐఆర్ పూర్తయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే.. జీహెచ్ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా బాగా పనిచేస్తోంది.. చాలా ఆస్తులు స్వాధీనం చేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినందుకే హరీశ్‌రావుకు కొన్నాళ్లు మంత్రి పదవి ఇవ్వకుండా కేసీఆర్ పక్కన పెట్టారు. గత ప్రభుత్వంలో ఇంటర్ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలతో 27 మంది విద్యార్థులు బలయ్యారు. గ్లోబరీనా సంస్థ విషయంలో కేటీఆర్ నిజాయతీ నిరూపించుకోవాలన్నారు. విద్యార్థుల మృతికి కారణమైన ఆయన క్షమాపణ చెప్పాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదని అన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆర్ఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు. జన్వాడ ఫాంహౌస్ భూములపై కేటీఆర్ విచారణ కోరాలి. మేం అధికారంలోకి వచ్చాకే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ఓపెన్ చేశాం. నాడు వాళ్లు మూసిన ధర్నా చౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.

## గ్లోబరీనా సంస్థతో నాకు సంబంధం లేదు

మొదటిపేజీ తరువాయి..

తనకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో చేసిన ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి సంబంధించి తమ న్యాయ బృందం త్వరలోనే ముఖ్యమంత్రికి లీగల్ నోటీసు పంపనున్నట్లు వెల్లడించారు. అలాగే, ముఖ్యమంత్రి తరచూ తనపై అసభ్యకరమైన, ఆధారరహిత ఆరోపణలు చేస్తున్నప్పటికీ వాటికి తాను ఎక్కువగా స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తన మౌనం ఆరోపణలను అంగీకరించినట్లు కాదని, నిరాధార విమర్శల స్థాయికి దిగజారి వాదించడం తనకు ఇష్టం లేదని వ్యాఖ్యానించారు. గ్లోబరీనా తన బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఇప్పటికే పరువు నష్టం నోటీసులు పంపానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి.. ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించలేదని విమర్శించారు. లోక్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకం మాత్రమే అని విమర్శించారు. 'గ్లోబరీనా నిజంగానే నా బినామీ సంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుంది? మీ ప్రభుత్వమే ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, ఇప్పుడు అది నా బినామీ సంస్థ అని చెప్పడం ఎంతవరకు సమంజసం?' అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో.. రాత్రి బీజేపీతో ఉంటారంటూ దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు ఒక మూట ఇస్తే, బీజేపీకి రెండు మూటలు పంపుతున్నారని ఆరోపించారు. నేను సీఐడీ విచారణకు సిద్ధం.. రేవంత్ రెడ్డి కుటుంబ అవినీతి అంశంలో సిట్, సీఐడీ విచారణకు సిద్ధమా' అంటే మాజీ మంత్రి సవాల్ విసిరారు. మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా సీఎం భయపడుతున్నారన్నారు. ఓ వైపు పాత కేసుల భయం, మరోవైపు అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు చేస్తున్నారన్నారు. గ్లోబరీనా సంస్థపై రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. రుజువు చేయాలని.. లేదంటే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు

## నేడు దేశవ్యాప్త ఆందోళనలు

మొదటిపేజీ తరువాయి..

ఏర్పాట్లకు సిద్ధం కావాలని యువతను కోరింది. శాంతియుతంగానే నిరసనలు ఉండాలని కూడా సూచించింది. పేపర్ లీక్ అంశంపై చర్చకు తాము సిద్ధమని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ మరో నిరసన కార్యక్రమానికి సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిరసన కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు పొందేందుకు, ఏర్పాట్లు చేసేందుకు విద్యార్థి సంఘాలు, యూత్ ఆర్గనైజేషన్లు కలిసి పనిచేయాలని సీజేపీ పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీక్ అంశంలో సీజేపీ డిమాండ్స్ గురించి ఈ నిరసనల్లో బహిరంగంగా చదవాలని పేర్కొంది. బాధితులకు సంఘీభావంగా ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేయాలని కూడా సూచించింది. నిరసనల్లో కేవలం సానుకూల నినాదాలను మాత్రమే చేయాలని చెప్పింది. ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొంది. నిరసనకు అనుమతి ఉన్న ప్రాంతాలకే పరిమితం కావాలని, ట్రాఫిక్‌కు ఆటంకాలు లేకుండా చూసుకోవాలని సూచించింది. రెచ్చగొట్టే చర్యలకు స్పందించవద్దని కూడా పేర్కొంది. ఇక నీట్ ఉదంతంపై విచారణ కోసం కేంద్రం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఇదిలావుంటే సీజేపీ ఆందోళనల నేపథ్యంలో న్యూఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆందోళనల తీవ్రత అధికంగా ఉన్న కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30కే దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు యజమానులు సహకరించాలని కోరింది. ఎన్‌డీటీఏ ఆదేశాలను ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు మూసేయమనడం, జంతర్‌మంతర్ వద్ద పోలీసులను మోహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్రం మరోసారి బలప్రయోగం చేయాలని చూస్తోందని ఆరోపించారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. హింసలో పాల్గొన్న వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేసే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. నిరసనల సమయంలో జరిగిన ఘటనలకు సంబంధించిన ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. సీసీటీవీ దృశ్యాలు, వీడియోలు, ఫొటోలు, ఇతర డిజిటల్ ఆధారాల ఆధారంగా హింసలో పాల్గొన్న వారిని గుర్తించే పక్రియ కొనసాగుతున్నట్లు సమాచారం. కాగా, నీట్ పేపర్ లీక్ వ్యవహారం, విద్యావ్యవస్థలో అవకతవకలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది.

# వాయిదా పర్వం

మొదటిపేజీ తరువాయి..

సభ పలుమార్లు వాయిదా పడింది. పేపర్ లీక్ జరిగినట్టు ప్రభుత్వం అంగీకరిస్తే వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

రూల్ 267 కింద చర్చ చేపట్టాలని కోరుతుంటే ప్రభుత్వం అంగీకరించట్లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని కేంద్రం అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాతే తాము ఏ చర్చకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల తీరుపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. నీట్‌పై చర్చ నుంచి తప్పించుకోవాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని ఆరోపించారు. చర్చ ముందు షరతులు పెట్టడం భావ్యం కాదని అన్నారు. ఈ అంశంపై తన వాదన వినిపించే హక్కు ప్రభుత్వానికి కూడా ఉంటుందని అన్నారు. ఇదిలావుంటే పార్లమెంట్ వెలుపల విపక్షాలు, బిజెపిలు పరస్పర ఆందోళనలకు దిగారు. నిరసలనతో హోరెత్తించారు. కాంగ్రెస్ ఇండియా కూటమి ఒకవైపు, ఎన్‌డిఎ నేతలు మరో వైపు నిలబడి నినాదాలు చేశారు. అయితే ప్రధాని మోదీ ట్వీట్‌పై లోకసభ విపక్ష నేత, సీజేపీ గట్టి కౌంటర్ ఇచ్చాయి. విద్యార్థుల జీవితాలను దెబ్బ తీసింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని ఆరోపించాయి. ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్‌పై రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు.విద్యార్థుల జీవితాలను నాశనం చేసిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థులకు క్షమాపణలు చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నేరానికి పాల్పడిన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మరోవైపు సీజేపీ కూడా మోదీ ప్రకటనపై దీటుగా స్పందించింది. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతక బాధ్యత వహిస్తూ రాజీనామ చేయాలన్నారు. విద్యార్థులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. తమ డిమాండ్స్ నెరవేర్చే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది.

## తెలంగాణ శాసనసభకు ఆధునిక హంగులు

మొదటిపేజీ తరువాయి..

తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన పనుల పురోగతిని ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, జైవీర్ రెడ్డి తదితరులు ముఖ్యమంత్రితో కలిసి మరమ్మతు పనులను పరిశీలించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. శాసనసభకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, సందర్శకులకు మెరుగైన వసతులు కల్పించేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన తెలంగాణ శాసనసభ ప్రాంగణాన్ని మరింత మెరుగైన మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు చేపట్టిన పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా అధికారులను ఆదేశించామని తెలిపారు. శాసనసభ భవనం ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

## పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టు

మొదటిపేజీ తరువాయి..

పరిరక్షించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. అలాగే మన యువత భవిష్యత్తుకు హాని కలిగించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే తమ తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. 'మన యువత సంక్షేమం, వారి భవిష్యత్తు కంటే.. ఏదీ ముఖ్యం కాదు! పేపర్ లీకేజీల్లో ప్రమేయం ఉన్నవారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దీనికి సంబంధించి అవసరమైన అన్ని చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాను. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు మేము తీసుకుంటున్న వరుస చర్యల్లో ఇది భాగం.

### మహానగరం నడిబొడ్డున

## పేదోడికి ఇల్లు ఉండొద్దా

మొదటిపేజీ తరువాయి..

అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా మీసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్ధిపొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.

## నేటి తరానికి తగ్గుతున్న ఓపిక

మొదటిపేజీ తరువాయి..

బెయిల్‌పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలను చేసింది. ఈ కేసులో జస్టిస్ ఎం. ఎం సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలె ధర్మాసనం సోనమ్ బెయిల్‌ను రద్దు చేసింది. ఆమె మూడు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. మారుతున్న సమాజంలో ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయి. నేటి తరానికి ఓపిక తక్కువ. సమస్యలకు తక్షణ పరిష్కారాలు కావాలని వారు కోరుకుంటున్నారు. వ్యక్తిగత చట్టాలకు సంబంధించిన పలు కేసులు భవిష్యత్తులో కోర్టుల ముందుకు వస్తాయని జస్టిస్ సుందరేశ్ అన్నారు. ఇక ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనలర్ తుషార్ మెహతా తన వాదనలు వినిపిస్తూ సమాజిక మాధ్యమాల ద్వారా ప్రస్తుత తరానికి అధిక సమాచారం అందుబాటులో ఉందని అన్నారు. కానీ జ్ఞానం మాత్రం లేదని వ్యాఖ్యానించారు. వాట్సాప్‌లో షేర్ చేస్తున్న సమాచారమే జ్ఞానంగా చెలామణీ అవుతోందని జస్టిస్ వరాలె ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'హనీమూన్‌కు వెళ్లే భర్త తన వెంట బాడీగార్డులను కూడా తీసుకెళ్లినట్టు చెప్పే కామెడీ రీల్స్ వస్తున్నాయి. భార్యాభర్తల మధ్య ఒకప్పుడున్న పరస్పర విశ్వాసం క్రమంగా తగ్గిపోతోంది. గతంలో ఇలాంటి సందర్భాల్లో ఉమ్మడి కుటుంబాలు భార్యాభర్తల సమస్యలను మెరుగ్గా పరిష్కరించేవి' అని సొలిసిటర్ జనరల్ మెహతా చెప్పారు. ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ.. 'మీరు ఉమ్మడి కుటుంబంలోని వారైతే అసంతృప్తిని ఎదుర్కోవడం, సర్దుకుపోవడం అలవాటు అవుతుంది. చిన్న కుటుంబాల్లోని వారు ఏదైనా తక్కువైతే మారాం చేస్తారు' అని వ్యాఖ్యానించింది. చిన్న కుటుంబాల కారణంగా జనాల్లో డిప్రెషన్ పెరుగుతోందన్న నివేదికలు కూడా ఉన్నాయని మెహతా చెప్పారు.

## సాధ్యమైనంత త్వరగా ఉద్యమకారుల గుర్తింపు

మొదటిపేజీ తరువాయి..

వివిధ సంఘాలతో చర్చించామని వివరించారు. ఉద్యమకారులను ఎలా ఎంపిక చేయాలి? ఎలా గౌరవించాలి అనే దానిపై అన్ని పార్టీల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని పార్టీలు స్వాగతించాయని తెలిపారు. సంఘాల నుంచి వచ్చిన సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామని స్పష్టం చేశారు. ఈ చర్చలకు 13 వేల మంది హాజరయ్యారని వివరించారు. దాదాపు వెయ్యి మంది సూచనలు చేశారని చెప్పారు. అయితే ఈ సమావేశాలు ముగియలేదని అన్నారు. వీటిపై ఆన్‌లైన్‌లో అభిప్రాయాలు కూడా తీసుకుంటామని తెలిపారు. అందుకు సంబంధించిన తేదీలు ప్రకటించి.. ఉద్యమకారులు, సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఉద్యమకారులకు తగిన గౌరవం దక్కేలా ఈ కమిటీ పని చేస్తుందని చైర్మన్ కేశవరావు వివరించారు. త్వరలో వివిధ జిల్లాల్లో పర్యటించి.. ఉద్యమకారులు, సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తామని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను గౌరవిస్తామని తెలిపారు. ఆయనను కూడా ఈ చర్చలకు ఆహ్వానిస్తామని చెప్పారు. అప్పటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కూడా సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిసెంబర్‌లోపే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ దయాకర్ వివరించారు.

## కాంగ్రెస్, కమ్యూనిస్టుల జంతర్ మంతర్ రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి..

పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పేపర్లు లీక్ అయినప్పుడు కాంగ్రెస్‌లోని నేతలు ఏ రోజైన రాజీనామా చేశారా? అని ఆ పార్టీ నేతలను నిలదీశారు. యూపీఏ హయాంలో ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ఆ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించారు. దేశ




రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌తోపాటు రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సంఘటనలు రాజకీయ ప్రేరేపితమైనవని అభివర్ణించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో షాహిన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులు దీని వెనుక ఉన్నట్లు అనిపిస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం జైలులో పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగ వద్దని మరోసారి నీట్ పరీక్షను నిర్వహించామని వివరించారు. పేపర్ లీక్‌పై 2024 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రాన్ని ప్రశ్నించే హక్కు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఉందా? అని బల్లగుద్దీ ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని ప్రధాని ఇంటి ముందు ధర్నా చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫాస్ట్ ట్రాక్ ద్వారా చట్టాన్ని మరింత కఠినం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదో తరగతి పేపర్ లీక్ అయిందని అన్నారు. మరి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా ఎందుకు చేయలేదని ఆ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించే సత్తా మీకు ఎక్కడిదంటూ తెలంగాణలోని అధికార పార్టీ నేతల తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థులపై ప్రేమ లేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి



**జన్నారం, జూలై 23 (ప్రజాజ్యోతి) :** నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేశారు. ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు గురువారం రోజున మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యురాలు ప్రియాంక గాంధీ లతోపాటు ఇతర ప్రతిపక్ష నాయకులను అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని,అలాగే నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రజా సమస్యలపై పోరాడినందుకు కేంద్ర ప్రభుత్వం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రజల గొంతుక రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బిజెపి మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ, రైతు, యువత, నిరుద్యోగ, మహిళా సమస్యలపై ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీని టార్గెట్ చేయడం ప్రజాస్వామ్యానికి బిజెపి చేస్తున్న అవమానమని అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మరియు విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు వెంటనే వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అజ్మీరా నందునాయక్, పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి నారాయణ,జిల్లా కార్యదర్శి సయ్యద్ ఇస్సాక్, కార్యదర్శి ముజాఫర్ అలీ ఖాన్,ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం,మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్ర శేఖర్, సీనియర్ నాయకులు ముత్యం రాజన్న,రాగుల శంకర్,అల్లం వెంకట్రాజం, కంప సుధీర్,ఫాతిమా సాహిని,షాకీర్,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, జూలై 23 (ప్రజాజ్యోతి):** జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం హాజీపూర్ మండలాల్లో పర్యటించిన ఆయన ప్రభుత్వ పాఠశాలలు, తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రం, అమృత్--2.0 పనులను ఆకస్మికంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. హాజీపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసీల్దార్ పుష్పలతతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమీక్షించారు. ప్రజల నుంచి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని, బూత్ స్థాయి అధికారులు వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సహకారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. భూభారతి, సాదా బైనామా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కార తీరును కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల పనితీరు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, జలసిరి కార్యక్రమం కింద చేపట్టిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# విద్యా వ్యవస్థ విచ్ఛిన్నం

## మోదీ ధర్మేంద్ర ప్రధాన్‌లు వెంటనే దిగిపోవాలి

### బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్ కుమార్



**సోనాల, జులై 23 (ప్రజాజ్యోతి) :** సోనాల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శాంతి యుత నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈరోజు సోనాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సోనాల శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. గూడాల అనీష్ కుమార్ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా నీట్, జేఈఈ లాంటి పోటీ పరీక్షల పేపర్ల లీకేజీపై బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ మరియు కేంద్ర విద్యాశాఖ మంత్రి

ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీని నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు దేశ రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ శాంతియుత నిరసన కార్యక్రమాలు చేస్తూ, యువత పోటీ పరీక్షల్లో పాల్గొంటూ ఉద్యోగాలు కల్పన కోసం కృషి చేస్తుంటే, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్,

పోటీ పరీక్ష పత్రాలను దేశవ్యాప్తంగా పల్లిలు, బటానీలు అమ్ముకునే చందంగా, యువత జీవితాలతో ఆడుకుంటూ వారి ఆత్మహత్యలకు కారణం అవుతున్నారని, బిజెపి ప్రభుత్వ 12 సంవత్సరాల పాలన కాలంలో 150 సార్లు వివిధ శాఖలకు సంబంధించిన పేపర్ లీకేజీలు జరగడంతో ఇప్పటివరకు దాదాపు 26 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిందని ఈ ఆత్మహత్యలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడిలి రాజీనామా చేయాలని, ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై

పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గాజుల పోతన్న. ఓబీసీ నియోజకవర్గ అధ్యక్షులు జంగాల బోజన్న, మార్కెట్ డైరెక్టర్ సోమన్న,సీనియర్ నాయకులు కసిరే పోతన్న, మాజీ సర్పంచ్ సోయం బాపురావు, ప్రకాష్, లాలూరాం, చెట్లపల్లి అశోక్,బాషెట్టి సుదర్శన్, అంకుష్, రాజారాం, ఖయ్యూం, అమృత్ రావ్, మహమూద్, శ్రీనివాస్ మరియు తదితరులు ఉన్నారు.

# ‘జలసిరి’ ఫామ్ పాండ్ నిర్మాణానికి కలెక్టర్‌చే శంకుస్థాపన

**- ‘జలసిరి’ ఫామ్ పాండ్‌లు భూగర్భ జలాల పెంపుదలకు దోహదం చేస్తాయి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 23, (ప్రజాజ్యోతి) :** నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం కుబీర్ మండలం దోడర్న గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా, ఫామ్ పాండ్ నిర్మాణ శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన రైతు దంపతులు గోరేకర్ సంతోష్, సాగరలకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో, ఫామ్ పాండ్ నిర్మాణానికి కలెక్టర్ గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఫామ్ పాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతులను ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో సన్మానించి, అభినందించారు. వారి వ్యవసాయానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్ ల నిర్మాణాలు దోహదం చేస్తాయని వివరించారు. ప్రతి రైతు బాధ్యతగా తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువ ఉన్నాయని, ఇటువంటి నీటి నిల్వ నిర్మాణాల వల్ల అత్యవసర పరిస్థితుల్లో పంటకు నీరు అందుతుందని తెలిపారు. భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ ల నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అనంతరం తెలంగాణ జలసిరి కార్యక్రమానికి సంబంధించి గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు, రైతులు కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ జాదవ్ సావిత్రి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలపై ఐక్య పోరాటం

**- హెచ్ఎంఎస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం - రాపిడోను అడ్డుకుంటాం.. అవసరమైతే జిల్లా బంద్‌కు సిద్ధం**
**- ఆటో కార్పొరేషన్, సంక్షేమ బోర్డు ఏర్పాటు సహా పలు డిమాండ్లు**





**మంచిర్యాల, జూలై 23 (ప్రజాజ్యోతి):** మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ఆటో డ్రైవర్ల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో వారి సమస్యల పరిష్కారం కోసం అన్ని ఆటో యూనియన్లు ఐక్యంగా ఉద్యమించాలని నిర్ణయించాయి. హెచ్ఎంఎస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల పట్టణంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఏ, బీఆర్‌టీయూ, బీఎంఎస్, 246 మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్, జేఏసీ ఆటో యూనియన్ తదితర సంఘాల జిల్లా నాయకులు పాల్గొని ఆటో రంగం ఎదుర్కొంటున్న సంక్షోభంపై సుదీర్ఘంగా చర్చించారు. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ఆటోలకు గిరాకీ గణనీయంగా తగ్గిపోవడంతో వేలాది మంది ఆటో డ్రైవర్లు కుటుంబ పోషణకే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రాపిడో వంటి యాప్ ఆధారిత సేవల వల్ల కూడా ఆటో డ్రైవర్ల ఆదాయం మరింత తగ్గిపోతోందన్నారు. రాపిడో కార్యకలాపాలను అరికట్టేందుకు అన్ని ఆటో యూనియన్లు ఐక్యంగా పోరాటం చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రభుత్వం స్పందించకపోతే మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బంద్ నిర్వహించి రాపిడో సేవలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే రూ.1,000 కోట్ల నిధులతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఆటో సంక్షేమ బోర్డును ప్రారంభించాలని, ఆటో డ్రైవర్లకు జీవన భృతిగా రోజుకు రూ.500 చొప్పున నెలకు రూ.15 వేల చెల్లించాలని, 50 సంవత్సరాలు దాటిన ఆటో డ్రైవర్లకు నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఆటో డ్రైవర్ల కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, ఆటోలకు సంబంధించిన ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర ప్రభుత్వ రుసుములను పూర్తిగా ప్రభుత్వమే భరించాలని కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో అన్ని ఆటో యూనియన్లను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ చేపడతామని నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి షఫీ, ప్రధాన కార్యదర్శి తగరం శ్రీనివాస్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు కట్ట రామ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఏ ఆటో యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సుద్దాల రాజు, బీఎంఎస్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చల్ల విక్రం, 246 ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొట్ట మధు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అభి పాషా, కలువల అంజయ్య, జూదం రాజు, దిలీప్ గౌడ్, పులి రాజేందర్ గౌడ్, ఆవుల సుధాకర్, రాగిడి రాజు, మాలం జగదీష్, నున్సావత్ చిరంజీవి, పిల్లి ఆనంద్, గోల్డ్‌మాన్ శీను, ముద్దం రాజేశ్వర్ రెడ్డి, ఎండి హుస్సేన్, పల్లపు శ్రీనివాస్, ఎండి అజీముద్దీన్, రాజుగారి మహేష్, అనంతుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ పై వ్యాసరచన పోటీలు

**జన్నారం, జూలై 23 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండల లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో అక్క పెల్లి గూడ ప్రాథమిక పాఠశాలలో గురువారం రోజున పర్యావరణ పరిరక్షణపై ఐదవ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.పర్యావరణ పరిరక్షణ వ్యాసరచన పోటీలలో ప్రథమ బహుమతి మంద వర్ణిక, ద్వితీయ బహుమతి దాడి అక్షయ్ రామ్, తృతీయ బహుమతి అబ్దుల్ వహాబ్ లు అందుకున్నారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బండారు మారుతి రాజ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని పర్యావరణాన్ని మనం కాపాడుకున్నప్పుడే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉంటారని కావున పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయా లని పిలుపునిచ్చారు.ప్లాస్టిక్ వాడకం వలన ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని, కావున ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని అన్నారు. ఆగస్టు 15న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు 100 స్టీల్ గ్లాసులు,నోటు పుస్తకాలు, పెన్నులు అందచేస్తామని మాటిచ్చారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జనరల్ సెక్రెటరీ గోలి రాము, కోశాధికారి రామ్ సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు శెట్టి రాజశేఖర్, అజ్మీర రమేష్, సుదీప, లలిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమాదేవి విద్యార్థులు పాల్గొన్నారు



## గాజిలిలో ‘ఎల్ నినో’ ప్రభావంపై ఏఈఓ ప్రత్యేక సమావేశం



**నేరడిగొండ జులై 23 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కుమారి గ్రామ పంచాయతీ పరిధిలోని గాజిలి గ్రామంలో గురువారం రైతులకు ‘ఎల్ నినో’ ప్రభావంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ, అధికారులు శ్రమించి వాగు దాటుకుంటూ గాజిలి చేరుకుని రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ) స్రవంతి రైతులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం కనిపిస్తున్న ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణంలో మార్పులు వస్తున్నాయని, పంటల సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఎవరూ కూడా పంటలకు అధిక మోతాదులో యూరియా వాడకూడదని, నేల స్వభావం మరియు అవసరాన్ని బట్టి మాత్రమే ఎరువులు వేసుకోవాలని తెలిపారు. అలాగే పత్తి విత్తనాలు విత్తే సమయం దాటిపోయినందున, ఇప్పుడు విత్తితే ఎలాంటి లాభం ఉండదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అగ్గిమాల్ల గోదావరి లస్మన్న, ఉపసర్పంచ్ ఆడెపు రవి, వార్డు సభ్యులు శంబు, తెడ్డు లలిత, పంచాయతీ కార్యదర్శి దత్తహరి మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వాడూర్‌లో 100% ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి

**అభినందించిన సర్పంచ్ శ్రీకాంత్**



**నేరడిగొండ జులై 23 (ప్రజాజ్యోతి) :** గ్రామ పంచాయతీ వాడూర్ లో 100% ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డిజిటలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు గాను గ్రామ పంచాయతీ అధికారి మరియు బిఎల్ఓ లను గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా సత్కరించింది. సర్పంచ్ అడేపు శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరియు వార్డు సభ్యులు మాట్లాడారు. గ్రామ స్థాయిలో డిజిటలైజేషన్ ప్రక్రియను ఎంతో బాధ్యతాయుతంగా, తక్కువ సమయంలో 100% పూర్తి చేయడానికి నిరంతరం శ్రమించిన అధికారుల సేవలను వారు ప్రత్యేకంగా కొనియాడారు.

ప్రభుత్వ లక్ష్య సాధనలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడేపు శ్రీకాంత్‌తో పాటు వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రముఖులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నూతన జనరేటర్ ప్రారంభం



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 23, (ప్రజాజ్యోతి) :** జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన జనరేటర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రాథోడ్ రమేష్ గురువారం ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయాల సమయంలో కూడా కలెక్టరేట్‌లోని కార్యాలయాల పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నూతన జనరేటర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, సిబ్బంది పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో దివ్య నగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 23, (ప్రజాజ్యోతి) :** నిర్మల్ పట్టణంలోని దివ్య నగర్ కాలనీ అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కోరిపల్లి రామ్ కిషన్ రెడ్డి, అధ్యక్షులుగా పురస్తు శంకర్, ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాసచారి, కృష్ణారెడ్డి, జనరల్ సెక్రెటరీగా సరసాని మహేందర్ రెడ్డి, కోశాధికారిగా ఇర్రి నరేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జి.రాకేష్ రెడ్డి, జి.అంబాజీ, కార్యవర్గ సభ్యులుగా జుట్టు లక్ష్మణ్, పత్తిరెడ్డి సుదర్శన్ రెడ్డి, అంగ రవి, ధర్మగడ్డ కృష్ణ కుమార్, రాచమల్ల రాజన్న, సుధార్ సింగ్, సలహాదారులుగా రాథోడ్ రాందాస్, కొంఢ్రు సురేష్, ముసుకు సతీష్ రెడ్డి, ఏలేటి విజయభాస్కర్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. తమపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు కాలనీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సంవత్సర కాలం నుండి మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్

## కలుషితమవుతున్న త్రాగునీరు

## మొద్దు నిద్రలో మిషన్ భగీరథ అధికారులు

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 23 (ప్రజా జ్యోతి): గత సంవత్సరం కాలం నుండి రహదారిపై మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజ్ తో త్రాగునీరు కలుషితమవుతున్న మున్సిపల్ కమిషనర్లు,మిషన్ భగీరథ అధికారు బదిలీలు అవుతున్నారే తప్ప లీకేజ్ సమస్య పరిష్కారం కాకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలోని తిరుమలయ్య చెరువు సమీపంలో పట్టణ కేంద్రం నుండి అనుగొండ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ప్రధాన మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ అయ్యి



సంవత్సరం పైన అవుతున్న సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అదే రహదారిపై సత్యసాయి మెగా,మిషన్ భగీరథ అధికారులు,మున్సిపాలిటీ అధికారులు తిరుగుతున్న లీకేజ్ సమస్యను పరిష్కరిద్దామన్న ఆలోచన లేకపోవడంపై అసలు మఖ్తల్ నియోజకవర్గంలో మిషన్ భగీరథ అధికారులు ఉన్నారా..? లేక మొద్దు నిద్రలో ఉన్నారన్న ప్రశ్న ప్రజల్లో నెలకొంది. ఇదే రహదారిపై ప్రతి రోజు ఖానాపురం,కర్ని, పంచలింగాల,చిట్యాల, పసుపుల,పంచదేవ్ పహాడ్,పారేవుల, ముస్లాయిపల్లి,దాదన్ పల్లి, అంకెన్ పల్లి, గడ్డం పల్లి, అనుగొండ మొదలుకొని దాదాపు 20 గ్రామాలకు ప్రజలు మఖ్తల్ కు వారి గ్రామాలకు తిరుగుతూ ఉంటారు. ఈ క్రమంలో రహదారి మధ్యలో లీకేజ్ అయిన గుంతలో వాహనాలు తిరగడం వల్ల త్రాగునీరు కలుషితమవుతుంది. అంతేకాకుండా లీకేజీ అడవి ప్రాంతంలో ఉండడం వల్ల కుక్కలు,పందులు మొదలగు జీవులతో పాటు విషపూరితమైన జీవులు అట్టి మిషన్ భగీరథ లీకేజ్ గుంతలోకి దిగి నీటిని తాగి చల్లదనం కోసం నీటిలో పడుకొని వెళ్తున్నాయని, మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిన తర్వాత కలుషితమైనటువంటి నీరు పైపులోకి వెళ్లడం వల్ల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. ఏది ఏమైనా మఖ్తల్ మున్సిపాలిటీలో గత సంవత్సర కాలం నుండి మఖ్తల్ పట్టణానికి త్రాగునీరు వచ్చే ప్రధాన పైపు లీకేజ్ వల్ల నీరు కలిసితమవుతున్న కూడా ఏమాత్రం పట్టించుకోకుండా అగ్రికారులు నిర్లక్ష్యం వహించడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి లీకేజీ సమస్యను పరిష్కరించి సురక్షితమైన త్రాగునీరును మఖ్తల్ పట్టణ వాసులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# విద్యార్థుల గొంతు నొక్కడం సరికాదు

- విద్యార్థులపై అణచివేతను ఖండిస్తున్నాం
- విద్యార్థి నిరసనలకు బీఆర్ఎస్ అండ.. హైదరాబాద్‌కు భారీగా తరలిరావాలని నిరంజన్ రెడ్డి పిలుపు

వనపర్తి, జూలై 23 (ప్రజాజ్యోతి): నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై నెల రోజులుగా ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం అణచివేతకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. విద్యార్థుల ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిరంజన్ రెడ్డి గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌లో శుక్రవారం బీఆర్ఎస్



విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వనపర్తి నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలివెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాల కారణంగా దేశవ్యాప్తంగా 7.5 కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారని ఆరోపించిన ఆయన, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుతంగా ఉద్యమించడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని, అలాంటి హక్కులను కాలరాస్తూ విద్యార్థులపై అణచివేతకు పాల్పడడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ చర్యలను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, చెన్నారం రమేష్, మహమూద్, బండారు కృష్ణ, చంద్రశేఖర్, డాక్టర్ డ్యానియల్, భాగ్యరాజ్, సయ్యద్ జమీల్, బాబు నాయక్, అస్లాం, ఇమ్రాన్, జిల్లా విద్యార్థి కోఆర్డినేటర్ హేమంత్ ముదిరాజ్, యువత అధ్యక్షుడు సూర్యవంశం గిరి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జోహెబ్ హుస్సేన్, యూసుఫ్, మండల యువత అధ్యక్షుడు చిట్యాల రాము, మునికుమార్, క్రాంతి, లక్ష్మణ్ గౌడ్, శివప్రసాద్ గౌడ్, శ్రీవాటి శంకర్, కుమార్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తున్న కౌన్సిలర్ పీకే నరసింహ

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 23 (ప్రజా జ్యోతి): నారాయణపేట జిల్లా మఖ్తల్ మున్సిపాలిటీలోని 4వ వార్డులో రాత్రి వేళల్లో పిల్లలు వృద్ధులు మహిళలు అవసరాల నిమిత్తం కాలనీలో తిరిగేందుకు స్తంభాలకు వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్న సమస్యను కౌన్సిలర్ పీకే నరసింహ గుర్తించి వార్డు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని వార్డులపల్లిచోట్ల ఉన్నటువంటి కొత్త స్తంభాలకు మున్సిపాలిటీ సిబ్బందితో ఎల్ఈడి లైట్లను ఏర్పాటు చేయించి రాత్రి సమయంలో ప్రజలు ఎవరు కూడా ఇలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు కొనసాగించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్లూరి అంజి,మున్సిపల్ సిబ్బంది బాలకృష్ణ,బాబు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

## పరిశుభ్రత,మరమ్మత్తులపై కలెక్టర్ ఆగ్రహం

గద్వాల జూలై 23(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన,మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్యాధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి ఐసీయూ,వివిధ వార్డులను పరిశీలించారు.రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఆసుపత్రిలో మంజూరైన వైద్య,ఇతర సిబ్బంది పోస్టుల్లో ఖాళీలను నిబంధనల ప్రకారం త్వరితగతిన భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం,పొదలు పెరిగిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.వినియోగంలో లేని పాత మంచాలు,వైద్య సామగ్రిని ఎక్కడపడితే అక్కడ నిల్వ చేయకుండా స్క్రాప్‌గా వేలం వేసి తొలగించాలని ఆదేశించారు.ఎగ్జామినేషన్,ట్రీట్మెంట్ విభాగంలో మానిటర్ యంత్రం పనిచేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.ఆసుపత్రికి అవసరమైన నిత్యావసర పరికరాలు,మందుల కొనుగోలుకు ప్రతిపాదనలు పంపితే తక్షణమే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.ఆపరేషన్ థియేటర్‌లో చేపట్టాల్సిన పనులపై కూడా అధికారులకు పలు సూచనలు చేశారు.ఆసుపత్రిలో విద్యుత్,రూఫ్ లీకేజీలు,కిటికీలు,తలుపులు,వాహనాల



పార్కింగ్ షెడ్ తదితర మరమ్మత్తుల కోసం ఇప్పటికే రూ.50 లక్షలు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై సంబంధిత అధికారులను కలెక్టర్ మందలించారు.పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.పై అంతస్తులోని 50 పడకల జనరల్ వార్డుకు వెళ్లే ర్యాంప్‌పై యుద్ధ ప్రాతిపదికన పైకప్పు నిర్మించాలని గుత్తేదారుకు సూచించారు.రోగుల సహాయకులు వేచి ఉండేందుకు ఆసుపత్రి ఆవరణలో షెడ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని,రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు.అనంతరం ఆసుపత్రి పర్యవేక్షకుల చాంబర్‌లో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు.వైద్యులు,సిబ్బంది హాజరు రిజిస్టర్లు,ఇతర రికార్డులను పరిశీలించి,చాలా కాలంగా విధులకు హాజరుకాని వైద్యులను సరెండర్ చేయాలని సూచించారు.అవుట్‌సోర్సింగ్ ద్వారా నియమించిన సెక్యూరిటీ,శానిటేషన్ సిబ్బంది సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పర్యవేక్షకురాలు ఝాన్సీ లక్ష్మి కి సూచించారు.అవసరమైతే నిబంధనల మేరకు అదనపు సిబ్బందిని నియమించాలని సంబంధిత ఏజెన్సీకి ఆదేశించారు.ఈ సందర్భంగా దివ్యాంగుల సదరం శిబిరం కోసం నూతనంగా నిర్మించిన భవనం,రేడియాలజీ విభాగం,మైత్రి ట్రాన్స్ క్లినిక్ తదితర విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.నిరుపయోగంగా ఉన్న వైద్య సిబ్బంది క్వార్టర్లను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.ఆసుపత్రికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ ప్రభాకర్,వైద్యశాఖ ఏఈ రహీం,వైద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం అవసరం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, జూలై 23 ( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తప్పులు లేకుండా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించిన ఆమె, జిల్లాలో ఇప్పటికే 79.62 శాతం డిజిటైజేషన్ పూర్తికాగా, 86.55 శాతం ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, పరిశీలన పూర్తైందని తెలిపారు. ఎన్నికల సంఘం గడువును ఆగస్టు 3 వరకు పొడిగించడంతో ప్రజలకు అదనపు అవకాశం లభించిందన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారని, 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఆర్‌వోలకు సూచించినట్లు చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లను నేరుగా తొలగించబోమని స్పష్టం చేసిన కలెక్టర్, క్షేత్రస్థాయి విచారణ అనంతరం మాత్రమే మరణించిన, శాశ్వతంగా ఇతర



ప్రాంతాలకు మారిన లేదా గుర్తించలేని ఓటర్ల పేర్లను తొలగిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫారం సమర్పించిన వారు మళ్లీ భౌతికంగా ఇవ్వాల్సిన అవసరం లేదని, బీఎల్‌వోలు కేవలం ధృవీకరణ మాత్రమే నిర్వహిస్తారని వివరించారు. ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశం ఓటరు జాబితా ప్రక్షాళన మాత్రమేనని పేర్కొన్న కలెక్టర్, ప్రస్తుత ప్రక్రియ పూర్తైన తర్వాత ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి ప్రజలు, రాజకీయ పార్టీలు అభ్యంతరాలు, దరఖాస్తులు సమర్పించే అవకాశం కల్పిస్తామని తెలిపారు. అనుమానాస్పద నమోదులపై ఆధారాల పరిశీలన అనంతరమే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఎన్నికల డీటీ జాఫర్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాల కార్మికులను పనిలో పెట్టుకునేవారిపై కఠిన చర్యలు:ఎస్పీ టి.శ్రీనివాసరావు

## జూలై 22 నాటికి 85 మంది చిన్నారుల రక్షణ,24 కేసుల నమోదు

గద్వాల జూలై 23(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్–12 కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.జూలై 1 నుంచి కొనసాగుతున్న కార్యక్రమం పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించి,తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్–12 కోఆర్డినేషన్ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ,జిల్లా వ్యాప్తంగా రెండు ప్రత్యేక పోలీసు బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.ఈ బృందాలతో పాటు మహిళా,శిశు సంక్షేమ శాఖ (డీడబ్ల్యూఓ), చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ),కార్మిక శాఖ (డీఎల్ఓ) తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకునే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుర్తించిన బాలబాలికలను షెల్టర్ హోమ్‌లకు తరలించి,వారి విద్య,సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని,14 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులను కౌన్సెలింగ్‌కు పిలుస్తామని వెల్లడించారు.బాలల భవిష్యత్తు పరిరక్షణే ఆపరేషన్ ముస్కాన్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.జూలై 22 నాటికి జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్–12లో మొత్తం 85 మంది చిన్నారులను రక్షించినట్లు తెలిపారు.వీరిలో 81 మంది బాలురు,4 మంది బాలికలు ఉన్నారు.రక్షించిన వారిలో 67 మంది తెలంగాణకు చెందిన వారు,18 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారు కాగా,24 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వెల్లడించారు.ఈ గణాంకాలు జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ కె.శంకర్,డీసీఆర్‌బీ సీఐ టాటాబాబు,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సహదేవుడు,డీడబ్ల్యూఓ అధికారి సునంద,డీసీపీఓ



నరసింహనాయుడు,ఆర్డీఓ కార్యాలయం ప్రతినిధి డి.టి.విమోచన,డీఈఓ కార్యాలయం నుంచి కర్రెప్ప,డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి జిల్లా ప్రోగ్రాం అధికారి జి. రాజు,కార్మిక శాఖ సీనియర్ అసిస్టెంట్ అబ్రహం,చైల్డ్ హెల్ప్‌లైన్–1098 కోఆర్డినేటర్ శివలీల,ఆపరేషన్ ముస్కాన్ బృందం ఎస్సైలు ఆర్.శేఖర్,సురేష్,డీసీఆర్‌బీ ఎస్సై సుకూర్,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి రోజున బండ తిరుమలయ్య స్వామివారి స్పర్శ దర్శనం

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 23 (ప్రజా జ్యోతి): నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణంలోని ఖానాపురం రోడ్డు తిరుమలయ్య చెరువు సమీపంలో బీమా కెనాల్ కాలువ పక్కన కొలువైన అతి పురాతనమైన సంతాన, వివాహ కారకుడైన భక్తుల కొంగుబంగారంగా పేరొందిన స్వయంభూ శ్రీ బండ తిరుమలయ్య స్వామి దివ్య క్షేత్రంలో





దేవాలయంలో ఈనెల 25న చాతుర్మాస్య ప్రారంభదినమైన ఆషాడ తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారికి విష్ణు సహస్రనామంతో తులసి అర్చన, విశేష పంచామృతము పుష్పార్చన, చతుర్వేద పారాయణం మొదలగు ప్రత్యేక కార్యక్రమాలతో పాటు తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం 7-00 నుండి భక్తులకు స్వామివారి స్పర్శ దర్శనం కనిపించడం జరుగుతుందని కావున భక్త మహాశయులు అత్యంత పురాతనమైన స్వామి వారి పూజ కార్యక్రమంలో పాల్గొని స్వయంభూ శ్రీ బండ తిరుమలయ్య స్వామి అనుగ్రహానికి పాత్రులు కాగలరని ఉడుపి పేజావర మఠం తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ ధర్మ ప్రచార కార్యదర్శి విద్వాన్ కె. రాఘవేంద్ర చార్యులు తెలిపారు.

# బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో గోమాతకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 23 (ప్రజా జ్యోతి): నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఓ ఆవు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయిందన్న విషయాన్ని తెలుసుకున్న మఖ్తల్ బజరంగ్ దళ్ శాఖ





కార్యకర్తలు ఆలయం వద్దకు చేరుకుని ఆలయ భక్తులతో కలిసి ఆలయం పక్కనే జెసిబి సహాయంతో గుంతను తవ్వించారు. మన సంప్రదాయంలో అంత్యక్రియలకు ఎంతో పవిత్రత ఉంది. గోవును దేవతగా పూజించే సంస్కృతి మనది కాబట్టి బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో దేవాలయ అర్చకుడు తిప్పయ్య స్వామి పర్యవేక్షణలో అనారోగ్యంతో చనిపోయిన గోమాతకు శాస్త్రోక్తంగా మరియు సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించి గోమాతకు కడసారి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తిప్పయ్య స్వామి,నారాయణ పేట జిల్లా బజరంగ్ దళ్ కో -కన్వీనర్ భీమేష్,ప్రఖండ సహ సంయోజక్ మూర్తి,మండల గోరక్ష సంయోజక్ శ్రీను, మల్లయ్య స్వామి, అక్షయ్,నాగరాజు,చక్రి,రాజు ,రాము, బజరంగ్ దళ్ కార్యకర్తలు ఇతరతులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యం- సురక్షితమే ధ్యేయం

-నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయి

-ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి






నాగర్ కర్నూల్ : 23 (ప్రజా జ్యోతి) నాగర్‌కర్నూల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి,జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ,ఆధునిక సాంకేతికతను వినియోగించి పట్టణాన్ని మరింత సురక్షితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని,నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ,ప్రజల ప్రాణాలకు మరియు ఆస్తుల భద్రతకు సి.సి కెమెరాలు దోహదడతా యన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర,వైస్ చైర్మన్ బాదం రమేష్ రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజ్ కుమార్,కౌన్సిలర్ లు డీఎస్పీ శ్రీనివాసులు,సీఐ,ఎస్ఐ లు,ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఆకేరు వాగులో అక్రమ ఇసుక దందా జోరు..!

- ధూప తండా పరిధిలో నిబంధనలకు తూట్లు..
- నలుగురు లీడర్ల కనుసన్నల్లో తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు
- ప్రకృతి సంపదకు ముప్పు.. అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?





**పర్వతగిరి, జులై 23 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండలం ధూప తండా గ్రామపంచాయతీ పరిధిలోని ఆకేరు వాగులో అక్రమ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు గ్రామస్థాయిలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గ్రామానికి చెందిన నలుగురు లీడర్ల ఆధీనంలో ఇసుక దందా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు, నిబంధనలను పక్కన పెట్టి వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని, దీని వల్ల సహజ వనరుల దోపిడీ జరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగుల నుంచి విచ్చలవిడిగా ఇసుక తరలిస్తే భవిష్యత్తులో భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని, వ్యవసాయంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

**అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట ఎప్పుడు? :** స్థానికుల ఆరోపణల ప్రకారం ఆకేరు వాగులో ఇసుక తరలింపులు కొంతకాలంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమార్కులు ధైర్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**రాత్రి వేళల్లో తరలింపులపై అనుమానాలు :** వాగు ప్రాంతంలో రహస్యంగా తవ్వకాలు చేసి ఇసుకను తరలిస్తున్నారని, ఈ వ్యవహారంపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇసుక తరలింపులో ఉపయోగిస్తున్న వాహనాలపై తనిఖీలు నిర్వహించి, అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి? :**
అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోవడంతో పాటు, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుం దని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వ కాలు జరిగితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

**రెవెన్యూ, మైనింగ్ శాఖలు స్పందించాలి :**
ధూప తండా ఆకేరు వాగులో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇసుక తవ్వకాలపై రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అక్రమాలు తేలితే ఎవరైనా సరే చర్యలకు వెనుకాడకూడదని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు... :**
ఆకేరు వాగు ఇసుక వ్యవహారంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

# వరంగల్ మేయర్ పీఠమే లక్ష్యం

- మున్సిపల్ ఎన్నికలపై బీజేపీ ఫోకస్ - పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం
- బూత్ స్థాయి నుంచి విజయమే లక్ష్యం - ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ పిలుపు
- వరంగల్‌లో బీజేపీ రాజకీయ తీర్మానాలు





**వరంగల్ సిటీ, జూలై 23(ప్రజాజ్యోతి) :** రాబోయే వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని భారతీయ జనతా పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టి, వరంగల్ అభివృద్ధికి బీజేపీయే ప్రత్యామ్నాయమనే అంశాన్ని బలంగా తీసుకెళ్లాలని సూచించారు. భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం వరంగల్‌లోని సుశీల్ గార్డెన్స్‌లో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు పార్టీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధి, మోడల్ బస్టాండ్, జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, నగర అభివృద్ధి వంటి అంశాలపై పార్టీ చేపట్టిన ఉద్యమాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వరంగల్ మేయర్ పీఠాన్ని గెలుచుకోవడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ముందుగా ప్రతి బూత్‌లో పార్టీ ఆధిక్యం సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో "రైతు గోస-బీజేపీ భరోసా" పేరుతో రైతుల సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని రాజకీయ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్ల పాలనను అభినందిస్తూ ప్రత్యేక తీర్మానాన్ని కూడా ఆమోదించారు. "సబ్కా సాథ్-సబ్కా వికాస్ - సబ్కా విశ్వాస్ - సబ్కా ప్రయాస్" స్ఫూర్తితో దేశాభివృద్ధి, పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలు, అభివృద్ధి లోపాలు, పెండింగ్ స్మార్ట్ సిటీ పనులు, నగర డ్రైనేజీ సమస్యలు వంటి అంశాలపై ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొని ప్రతి అర్హుడైన ఓటరు పేరు నమోదు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ దేవి, డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, రత్నం సతీష్ షా, గురుమూర్తి శివకుమార్, సిద్ధం నరేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, గందె నవీన్, రామచంద్రారెడ్డి, నరసింహ రాములు, తాబేటి వెంకట్ గౌడ్, మం జుల రెడ్డి, కౌన్సిలర్ జూలూరి రోజారాణి, సర్పంచులు తాళ్లపెల్లి కుమారస్వామి, శ్రీరామ్ భూపాల్, రాయపురం రమ్యారాజుతో పాటు జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, మోర్చా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారతీయ మజ్దూర్ సంఘ్ 72వ ఆవిర్భావ దినోత్సవం





**పరకాల, జూలై 23, (ప్రజాజ్యోతి) :** భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం పరకాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా గుర్తింపు పొందిన బీఎంఎస్ 1955లో స్థాపితమై అప్పటి నుంచి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భారతీయ మజ్దూర్ సంఘ్ భవన నిర్మాణ, ఇతర రంగాల రాష్ట్ర కార్యదర్శి అడగాని జనార్దన్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. గతంలో లేబర్ కార్డు కలిగిన కార్మికులకు లేబర్ శాఖ ద్వారానే మరణ, ప్రమాద బీమా ప్రయోజనాలు అందేవని, ప్రస్తుతం వాటిని ప్రైవేటు బీమా సంస్థలకు అప్పగించడం వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రైవేటు సంస్థల ద్వారా కాకుండా లేబర్ శాఖ ద్వారానే బీమా పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 60 ఏళ్లు దాటిన కార్మికులకు పింఛన్, ఆరోగ్య భద్రత కల్పించాలని, లేబర్ కార్డు రెన్యూవల్‌కు ఎప్పుడైనా అవకాశం ఇవ్వాలని కోరారు. నిరక్షరాస్యులైన కార్మికులు గడువులోగా రెన్యూవల్ చేసుకోలేకపోతున్నందున ప్రభుత్వం ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కార్మికులకు ద్విచక్ర వాహనాలు, అవసరమైన పనిముట్లు అందించడంతో పాటు ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ప్రమాదాలు జరిగినప్పుడు లేబర్ శాఖ ద్వారా తక్షణ ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్‌కు దూరంగా.. ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు






- టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' 2కే రన్
- ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

**హనుమకొండ జిల్లా ప్రతినిధి, జూలై 23, (ప్రజాజ్యోతి) :** మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ యువతకు పిలుపునిచ్చారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్‌జేయూ) హనుమకొండ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం "డ్రగ్స్‌కు దూరంగా.. ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు "నినాదాలతో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కాళోజీ జంక్షన్ వరకు 2కే రన్ నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, అదనపు కలెక్టర్ రవి, వరంగల్ డీసీపీ ధారా కవిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి "సే నో టు డ్రగ్స్" ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండి సమాజ నిర్మాణంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డీపీఆర్ఓ అయూబ్ అలీ, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, జర్నలిస్టు యూనియన్ నాయకులు, అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు.

# పీఏసీఎస్‌లలో అదే పద్ధతిలో పాలకవర్గాలా..? లేక రాజకీయ నియామకాలా..?

- చైర్మన్, డైరెక్టర్ పదవులపై విమర్శలు..
- గత అవినీతి ఆరోపణలపై విచారణ ఉంటుందా..?
- రైతులకు దూరమైన సహకార సంఘాలు..
- ప్రజాస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించాలని రైతుల డిమాండ్







**పర్వతగిరి, జులై 23 (ప్రజాజ్యోతి) :** వరంగల్ జిల్లా తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కొత్త పాలకవర్గాల ఏర్పాటు నేపథ్యంలో రైతులు, సహకార సంఘ సభ్యులు, రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. గతంలో ఉన్న ఎన్నికల విధానాన్నే కొనసాగిస్తారా? లేక రాజకీయ నియామకాల ద్వారానే చైర్మన్, డైరెక్టర్ పదవులను భర్తీ చేస్తారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రైతుల చేత, రైతుల కోసం, రైతులే పాలించే లక్ష్యంతో సహకార సంఘాల వ్యవస్థ ఏర్పాటైంది. సభ్యత్వం పొందిన రైతులు తమ ఓటుతో డైరెక్టర్లను ఎన్నుకోవడం, ఆ డైరెక్టర్లే తమలో నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవడం సహకార వ్యవస్థలో ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ విధానం రైతులకు ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని కల్పించడంతో పాటు సంఘాల నిర్వహణలో పారదర్శకతకు దోహదపడింది. అయితే ఇటీవల ఈ వ్యవస్థలో రాజకీయ జోక్యం పెరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో సేవా చరిత్ర, ప్రజాభిమానాన్ని సంపాదించిన నాయకులను పక్కనపెట్టి, ప్రజలకు పెద్దగా పరిచయం లేని వ్యక్తులకు చైర్మన్, డైరెక్టర్ వంటి కీలక పదవులు కట్టబెడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు నిరాశకు గురవుతుండగా, గ్రామస్థుల్లోనూ అసంతృప్తి పెరుగుతోందని చెబుతున్నారు. పీఏసీఎస్‌లు రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు, పంట పెట్టుబడి వంటి కీలక సేవలు అందించే సంస్థలు. అలాంటి సంస్థలకు నాయకత్వం వహించే వ్యక్తులకు రైతుల సమస్యలపై అవగాహన, సేవాభావం, పరిపాలనా సామర్థ్యం ఉండాలని రైతులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ అనుబంధం కంటే ప్రజల విశ్వాసం, అర్హత, నిజాయితీకి ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

**సొసైటీలపై ఉన్న మచ్చలు తొలగిపోయేనా..? :** 2020 ఫిబ్రవరి 15న జరిగిన పీఏసీఎస్ ఎన్నికల అనంతరం అప్పటి అధికార పార్టీ మద్దతుతో అనేక సహకార సంఘాల పాలకవర్గాలు ఏర్పడ్డాయి. ఆ తర్వాత కొందరు చైర్మన్లు, డైరెక్టర్లు రైతుల ప్రయోజనాల కోసం సమర్థంగా పనిచేసినప్పటికీ, మరికొన్ని సంఘాలపై అవినీతి, అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తాయి. రుణాల మంజూరు, ఎరువులు--విత్తనాల పంపిణీ, ధాన్యం కొనుగోలు, ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలు జరిగాయంటూ పలుచోట్ల ఆరోపణలు వినిపించాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారని, పారదర్శకత లోపించిందని సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో సహకార సంఘాలపై రైతుల్లో కొంత మేర విశ్వాస సంక్షోభం ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**విచారణ జరుగుతుందా..? లేక సర్దుకుపోతారా..? :**
కొత్త పాలకవర్గాల ఏర్పాటు నేపథ్యంలో గతంలో వచ్చిన అవినీతి, అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరుగుతుందా? బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? లేక వాటిని పక్కనబెట్టి రాజీ ధోరణి అవలంబిస్తారా? అనే ప్రశ్నలు రైతుల్లో చర్చనీయాంశంగా మారాయి. రైతుల అభిప్రాయం ప్రకారం, గతంలో జరిగిన ఆరోపణలపై పారదర్శక విచారణ చేపట్టి, అక్రమాలు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పుడే సహకార సంఘాలపై ప్రజల విశ్వాసం పునరుద్ధరించబడుతుంది. అదే సమయంలో కొత్త పాలకవర్గాల ఎంపికలో సేవా చరిత్ర, ప్రజాభిమానం, రైతుల సమస్యలపై అవగాహన, నిజాయితీ, జవాబుదారీతనం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేసినప్పుడే పీఏసీఎస్‌లపై పడిన మచ్చలు తొలగిపోతాయని, సహకార వ్యవస్థ మళ్లీ తన అసలు లక్ష్యాన్ని చేరుకుంటుందని రైతులు, సహకార సంఘాల సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ ఓటరు సవరణ ప్రక్రియ పరిశీలనలో కాంగ్రెస్ నాయకులు

100 శాతం పూర్తి చేసిన కల్లెడ గ్రామ బీఎల్వోలు, అధికారులకు సన్మానం





**పర్వతగిరి, జులై 23 (ప్రజాజ్యోతి) :** ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా పర్వతగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. మండలంలోని కల్లెడ గ్రామంలో ఎస్ఐఆర్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసిన అధికారులను, పార్టీ బూత్ లెవల్ ఆఫీసర్లను (బీఎల్వోలు) గ్రామ సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్ తో కలిసి ఇస్లావత్ సావిత్రి సన్మానించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణలో అధికారులు, బీఎల్వోలు చేసిన కృషిని అభినందించారు. అనంతరం అన్నారం షరీఫ్ గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియను ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ లతో కలిసి ఆమె పరిశీలించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రిని గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, ఏఎంసీ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి బోట్ల మహేంద్ర, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగు రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగు వినయ్ తదితరులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోటపోతుల సారంగపాణి, మాజీ సర్పంచ్ మునుకుంట్ల యశోద బాబు, రామ్మూర్తి, యాకయ్య, మహేందర్, జంగాల దయాకర్, మైసయ్య, సంపత్, వెంకన్న తదితర నాయకులు, వార్డు సభ్యులు రాపోలు అనిత రవీందర్, గాడిపెల్లి రాజబాబుతో పాటు గ్రామ నాయకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో రూ.80 వేల విలువైన గేదె మృతి

రైతు బాలె వెంకయ్యకు భారీ నష్టం, పరిహారం అందించాలని డిమాండ్



**పర్వతగిరి, జులై 23 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కల్లెడ గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై రైతు బాలె వెంకయ్యకు చెందిన గేదె మృతి చెందింది. సుమారు రూ. 80 వేల విలువైన గేదె మృతి చెందడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పరిధిలోని రోడ్డు పక్కనే పొలాల వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండటంతో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వెంకయ్యకు ఈ నష్టం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు దారితీసిందని పేర్కొన్నారు.

విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి, నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని రైతు కుటుంబం కోరుతోంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న స్తంభాలను వెంటనే సరిచేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం








- కేంద్ర ప్రభుత్వా నిరంకుశ వైఖరిని ఖండిస్తున్నాం
- అగ్ర నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధము
- విద్యార్థులపై దాడి దేశ భవిష్యత్తుపై దాడి
- నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు
- రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి

**రాయపర్తి జూలై 23 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా,రాయపర్తి మండల కేంద్రంలో నీట్ విద్యార్థులకు మద్దతుగా ఢిల్లీలో శాంతి యుతంగా నిరసన తెలిపిన ఏఐసీసీ అగ్రనాయకులు,లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియంకా గాంధీ లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి 563 పై గురువారం పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేసిన మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి. అనంతరం ఆయన ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించిన రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీక్ తో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని, విద్యార్థులపై జరిగిన లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని,నీట్ పరీక్ష లీక్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడి దేశ భవిష్యత్తుపై దాడి,బీజేపీ నిరంకుశ పాలనాకు నిదర్శనం,విద్యార్థుల గొంతును అణచివేయడం ఎవరి తరం కాదు,యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పోరాటం. కొనసాగుతుంది అనీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో తొర్రూర్ బ్లాక్ అధ్యక్షుడు హమ్య నాయక్, వర్ధన్నపేట ఏఎంసీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణా రేడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మర కళ్యాణ్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మచ్చ రమేష్ ప్రజా ప్రతీనిధులు,మండల ముఖ్య నాయకులు,యూవజన కాంగ్రెస్ నాయకులు,విద్యార్థి అనుబంధ సంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు

భువనగిరి,రూరల్ జులై 23(ప్రజాజ్యోతి):
భువనగిరి మండలం పెంచికల్ పహాడ్ గ్రామంలో,భువనగిరి పార్లమెంట్,సభ్యులు,చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు,చామల యువసేన నాయకులు హీరే కార్ శ్రీను ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంట్



సభ్యులు టైగర్ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.అనంతరం కేక్ కట్ చేసి అంగన్వాడి కేంద్రంలో చిన్న పిల్లలకు పండ్లు,కేకు పంపిణీ చేశారు. ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి ఆయురారోగ్యాలతో.సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు నిరంతరం సేవ చెయ్యాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఆయనకు జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు.ఈ కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ పన్నాల, మల్లికార్జున్ రెడ్డి బోయిపల్లి అచ్చిరెడ్డి,గోపె ఎల్లయ్య, సుబ్బురు సిద్దేశ్ సిలువేరు శ్రీను,గోపి నరసింహ,ప్రవీణ్ నవీన్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ శాంతియుత నిరసనలు

నకిరేకల్: జూలై 23, ప్రజా జ్యోతి:
నకిరేకల్ పట్టణ కేంద్రంతో పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఢిల్లీలో ఏఐసీసీ జాతీయ నాయకులు, లోక్‌సభ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు చేపట్టిన శాంతియుత





నిరసన సందర్భంగా వారిపై దాడి చేసి, అనంతరం అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం హాజరై కేంద్ర ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని, ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలను మానుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

## తొలి ఏకాదశి ఉత్సవాలకు ఎమ్మెల్యే వేముల వీరేశానికి ఆహ్వానం

నకిరేకల్. జులై 23.. ప్రజా జ్యోతి
నకిరేకల్ నియోజకవర్గం: ఈ నెల 25న నార్కట్పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ



పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న తొలి ఏకాదశి ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే వేముల వీరేశం కృతజ్ఞతలు తెలిపారు. తొలి ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరగాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

హుజూర్ నగర్, జూలై 23(ప్రజా జ్యోతి):
పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించాలని మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శివరామ ప్రసాద్ ఆదేశాలు జారీ చేసినట్లు మండల న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీపతో పాటు పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొని విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కలిగిస్తారని ఒక ప్రకటనలో తెలిపారు.



# ఒక్క గురువు... వేల భవిష్యత్తులకు దిక్సూచి

గరిడేపల్లి,జూలై 24(ప్రజా జ్యోతి):
ఉపాధ్యాయుడు అంటే పాఠాలు చెప్పే వ్యక్తి మాత్రమే కాదు... సమాజాన్ని తీర్చిదిద్దే శిల్పి



కూడా. ఆ మాటకు నిజమైన నిర్వచనంగా నిలుస్తున్నారు చారుగుండ్ల రాజశేఖర్.తరగతి గదిలో విద్యాబోధనతో పాటు, బడిమానేసిన పిల్లలను తిరిగి పాఠశాలకు చేర్చడం, వలసలను అడ్డుకోవడం, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపడం, రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడడం వంటి అనేక సేవలతో ఆయన ఒక ఉపాధ్యాయుడిగా మాత్రమే కాకుండా సమాజ సేవకుడిగా విశిష్ట గుర్తింపు పొందారు.

### 24 ఏళ్లుగా నిరంతర విద్యాసేవ

2002లో ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టిన రాజశేఖర్,సిరిపురం, వల్లాపురం,కూచిపూడి తండా తదితర ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహి స్తూ ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపు,నాణ్యమైన బోధన,మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు నిరంతరం శ్రమించారు.

### వలసలకు అడ్డుకట్ట... చిన్నారులకు బంగారు భవిష్యత్తు

ప్రస్తుతం రంగాపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న రాజశేఖర్, గ్రామంలోని జంగాల కుటుంబాలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తూ పిల్లలను కూడా వెంట తీసుకెళ్తున్న పరిస్థితిని గుర్తించారు. తల్లిదండ్రులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి,కౌన్సెలింగ్ ఇచ్చి,పిల్లల చదువు మధ్యలో ఆగిపోకుండా గ్రామంలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా చైతన్యం కల్పించారు.ఈ ప్రయత్నాల వల్ల అనేక మంది చిన్నారులు తిరిగి బడిబాట పట్టారు.6 మంది నుంచి 26 మందికి... ప్రభుత్వ బడిపై పెరిగిన నమ్మకం సహచర ఉపాధ్యాయుడు రామిశెట్టి లక్ష్మయ్య సహకారంతో రంగాపురం పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను కేవలం 6 మంది నుంచి 26 మందికి పెంచడం ఆయన కృషికి నిదర్శనం.ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించడం,పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచడం ద్వారా ప్రభుత్వ పాఠశాలపై గ్రామస్తుల్లో విశ్వాసాన్ని పెంపొందించారు.

### బడి మానేసిన పిల్లల కోసం... స్వయంగా బండిపై వెళ్లిన గురువు

డ్రాపౌట్ అయిన పిల్లలను తిరిగి పాఠశాలకు తీసుకురావడానికి రాజశేఖర్ చేసిన కృషి ప్రత్యేకంగా నిలిచింది.అవసరమైతే తన ద్విచక్ర వాహనంపై పిల్లలను తీసుకువచ్చి బడిలో



చేర్పిస్తూ చదువుకు దూరం కాకుండా కాపాడారు.విద్యార్థుల హాజరు పెంచేందుకు స్నాక్స్ అందించడం,క్రమం తప్పకుండా వచ్చే వారికి బహుమతులు ఇవ్వడం వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టారు.

### సొంత డబ్బుతో పాఠశాలకు కొత్త రూపు

ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా రూ.18 వేల సొంత ఖర్చుతో రంగాపురం ప్రాథమిక పాఠశాలకు రంగులు వేయించి, పరిశుభ్రమైన,ఆకర్షణీయమైన విద్యా వాతావరణాన్ని రూపొందించారు. ప్రభుత్వ పాఠశాల కూడా కార్పొరేట్ స్థాయి వాతావరణాన్ని కలిగి ఉండాలనే ఆయన ఆలోచన అందరి ప్రశంసలు అందుకుంది.

### ఐదు లక్షల మంది విద్యార్థులకు ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ

వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా గత 16 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 వేల విద్యాసంస్థల్లో 5 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ప్రేరణ,వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్యసాధన, నాయకత్వం,విలువలతో కూడిన జీవితం వంటి అంశాలపై విద్యార్థులను చైతన్యవంతులను చేస్తున్నారు.

### 'విజయీభవ ప్రతిభ అవార్డ్స్'తో ప్రతిభకు ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మెరిట్ సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలనే సంకల్పంతో గత పుష్కర కాలంగా ప్రతి సంవత్సరం కోదాడ,హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో 250 మంది విద్యార్థులకు "విజయీభవ ప్రతిభ అవార్డ్స్" అందజేస్తూ ప్రతిభను వెలికితీస్తున్నారు.

### 45 సార్లు రక్తదానం... వేల మందికి జీవనదానం

రాజశేఖర్ ఇప్పటివరకు 45 సార్లు స్వచ్ఛంద రక్తదానం చేశారు.అంతేకాదు 256 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన వాట్సాప్ బృందం ద్వారా సుమారు 1,250 మంది అవసరమైన వారికి అత్యవసర రక్తదానం అందేలా సమన్వయం చేసి ఎన్నో కుటుంబాలకు ఆశాకిరణంగా నిలిచారు.

### కలాం ఆశయాలకు నివాళి... విద్యకు గౌరవం

యువతకు స్ఫూర్తినిచ్చే మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని కోదాడ గాంధీ పార్కులో,సరస్వతి దేవి విగ్రహాన్ని కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించి విద్యకు, జ్ఞానానికి తన గౌరవాన్ని చాటిచెప్పారు.

### సమాజానికి స్ఫూర్తి

విద్యను ఉద్యమంగా, సేవను జీవన లక్ష్యంగా మలుచుకున్న చారుగుండ్ల రాజశేఖర్ చేస్తున్న సేవలు ఒక ఉపాధ్యాయుడు సంకల్పిస్తే సమాజంలో ఎంతటి మార్పు తీసుకురాగలడో నిరూపిస్తున్నాయి.విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన చేస్తున్న అంకితభావం, మానవత్వంతో కూడిన సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి.

## ప్రత్యేక ఓటరు రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్

వెంపటి, రామన్నగూడెం తండా, మంచ తండా, సూర్య తండా, దేవునిగుట్ట తండాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం

తుంగతుర్తి, జులై 23, (ప్రజాజ్యోతి):
తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ ఆదేశాల మేరకు తుంగతుర్తి మండలంలోని వెంపటి, రామన్నగూడెం తండా, మంచే తండా, సూర్య తండా,





దేవునిగుట్ట తండా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగటి రవి గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు రివిజన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన నాయకులు, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను స్థానిక బీఎల్ఓలకు అందజేశారు. ఈ సందర్భంగా రేగటి రవి గౌడ్ మాట్లాడుతూ...అర్హత కలిగిన ఒక్క నిజమైన ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ (BLA) ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రెండు ఓట్లు ఉన్నట్లయితే వారిని చైతన్యపరచి ఒకే చోట ఓటు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. కొత్త ఓటరు నమోదు, పేరు మార్పులు, చిరునామా మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా పూర్తి వివరాలతో జాగ్రత్తగా నింపాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న ఆయన, ప్రతి అర్హుడూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పానుగంటి నరసింహారెడ్డి, తుంగతుర్తి సింగల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, గ్రంథాలయ చైర్మన్ గంగరాజు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోలేపాక రామచంద్రు, రుద్ర రామచంద్రు,దాసరి శ్రీను,నల్లు రామచంద్రారెడ్డి, మహేందర్, కొండరాజు, దీప్లా నాయక్, ఆకారపు ఎల్లయ్య, కొండ పరశురాం, అబ్బగాని వేణు, వెంకటేష్ నాయక్, వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, సూపర్వైజర్లు, బి ఎల్ ఏ లు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాహుల్, ప్రియాంక గాంధీ ల అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రాలలో కాంగ్రెస్ ఆందోళన

ప్రశ్నించే గొంతులను అణిచివేస్తున్న కేంద్రం : ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

మిర్యాలగూడ, జులై 23,( ప్రజాజ్యోతి ):
ప్రశ్నించే గొంతులను కేంద్రం అణచివేస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ల పిలుపుమేరకు మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాన రహదారులపైకి చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులు ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి ఎల్ ఆర్ మాట్లాడుతూ పేపర్ లీకేజీలతో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వం కేంద్ర విద్యా శాఖ మంత్రిని తొలగించకుండా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి నాయకుల పై, విద్యార్థులపై విచక్షణ రైతంగా లాఠీలతో దాడిలు చేసి అణచి వేయడం దారుణం అన్నారు. విద్యార్థులకు మద్దతుగా న్యాయం పక్షాన నిలిచిన కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్, ప్రియాంక గాంధీ లపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశంలో వారికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్చుకోలేక కేంద్రం అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని మండిపడ్డారు. వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నాలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో బిజెపి ప్రభుత్వానికి గట్టి బుద్ది చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల పార్టీ అధ్యక్షులు, వివిధ కాంగ్రెస్ విభాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.





## తిరుమలగిరి గ్రామంలో ఘనంగా మొక్కల పంపిణీ కార్యక్రమం

పి ఏ పల్లి, జులై 23(ప్రజా జ్యోతి):
పెద్ద అడిశర్లపల్లి (పి.ఎ.పల్లి) మండలం తిరుమలగిరి గ్రామ పంచాయతీ పరిధిలో ఈరోజు మొక్కల పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామ సర్పంచ్ బెల్లి కృష్ణమ్మ ఆంజనేయులు



ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బెల్లి కృష్ణమ్మ ఆంజనేయులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు, హరితహారం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ ఇంటి ప్రాంగణంలో మొక్కలు నాటాలని కోరారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని రక్షించి వృక్షాలుగా మార్చే వరకు బాధ్యత తీసుకోవాలని గ్రామ ప్రజలను కోరారు.గ్రామంలోని ప్రతి ఇంటికి నీడను ఇచ్చే మొక్కలతో పాటు, వివిధ రకాల పండ్ల మొక్కలను పంచాయతీ సిబ్బంది. సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.మదు ,వార్డు సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్ పి ఆర్ పి గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

విద్య, ఆహారం, వసతి,పరిశుభ్రతపై సమగ్ర పరిశీలన: ప్రిన్సిపాల్ సంధ్యారాణికి ప్రశంసలు

తుంగతుర్తి, జులై 23,(ప్రజా జ్యోతి):
తుంగతుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను బుధవారం ఎంపీడీవో చలపతి సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు,





పరిశుభ్రత పారిశుధ్య నిర్వహణ భద్రత ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. తనికి ల్లో భాగంగా డైనింగ్ హాల్, వంటశాల, హాస్టల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న విద్య, ఆహారం, తాగునీరు వసతి సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థినీలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న వెంటనే ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ గాని ఉపాధ్యాయులు గానీ హాస్టల్ పరిశుభ్రత, భద్రత విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదని అన్నారు. హాస్టల్ నిర్వహణ పరిశుభ్రత విద్యార్థినీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి నీ అభినందించారు.

## మీసేవ కేంద్రాన్ని
# ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసీల్దార్ అశోక్



**కొండాపూర్ ప్రజాజ్యోతి** మండల పరిధిలోని మల్కాపూర్ చింతల్ లో ఉన్న మీసేవ కేంద్రాన్ని తహసీల్దార్ అశోక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలు, దరఖాస్తుల స్వీకరణ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. మీసేవ కేంద్రానికి వచ్చిన ప్రజలతో మాట్లాడిన తహసీల్దార్ అశోక్, వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవలను నిర్ణీత గడువులో అందించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. సేవల అందజేతలో నిర్లక్ష్యం, అనవసర జాప్యం లేదా అదనపు రుసుముల వసూళ్లు వంటి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ పారదర్శకంగా సేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సంబంధిత రెవెన్యూ సిబ్బంది, మీసేవ కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీకి సీసీ కెమెరాల
# అందజేసిన లయన్స్ క్లబ్ బాధ్యులు




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 23:** లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ ఆధ్వర్యంలో పట్టణ భద్రత, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతికి గురువారం సీసీ కెమెరాను అందజేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాయి సంగమేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి మాట్లాడుతూ..నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పిస్తూ అందరి ఆరోగ్య పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ పరిశుభ్రత కోసం శానిటేషన్ కార్మికులు ప్రతిరోజూ అంకితభావంతో పనిచేస్తున్నారని, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తే మరింత పరిశుభ్రమైన నారాయణఖేడ్‌ను నిర్మించగలమని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ తరఫున సమాజ సేవలో భాగంగా సీసీ కెమెరాను మున్సిపాలిటీకి అందజేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ చంద్రశేఖర్ ఆచార్య, సభ్యులు యూసుఫ్, అబ్రార్, ముదస్సిర్, మొహీత్, బసవ చైతన్య, మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండిస్తూ టీఎస్ యూటీఎఫ్ నిరసన ర్యాలీ

● నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలి

● సోనం వాంగ్చుక్‌ను వెంటనే విడుదల చేయాలి




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 23:** నీట్, యూజీసీ నెట్ పరీక్షల పేపర్ లీక్ ఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నారాయణఖేడ్ పట్టణంలో టీఎస్ యుటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం భారీ సంఘీభావ ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీలో విద్యార్థులు, యువజనులు చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు టీఎస్ యుటీఎఫ్ నాయకులు తెలిపారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తూ, సామాజిక ఉద్యమకారుడు సోనం వాంగ్చుక్‌ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై. జ్ఞాన మంజరి, జిల్లా అధ్యక్షుడు కె. అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్ జాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వల్ల పేపర్ లీకేజీలు, అక్రమాలు పెరుగుతున్నాయని విమర్శించారు. ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం, విద్యార్థుల ఉద్యమాలను అణచివేయడానికి లాఠీచార్జ్‌లకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యామంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు హరిసింగ్, నరేష్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్, యాదయ్య, గంగమోహన్, రవికుమార్, విష్ణు, ప్రవీణ్, నందు, కాంతయ్య, దత్తాత్రి, అరుణ, సుజాత, దివ్య, సబిత, జ్యోతి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్
# సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా చిరంజీవి





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 23:** నారాయణఖేడ్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) సంగారెడ్డి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోజి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి. రాములు యాదవ్ ఆధ్వర్యంలో నూతన జిల్లా కన్వీనింగ్ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా చిరంజీవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా లక్ష్మణ్, మోష, బోరంచ గణేష్, షోయల్ రాజేష్, శోభలను నియమించారు. జిల్లా కన్వీనర్‌గా ఎన్నికైన చిరంజీవి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ప్రజా సమస్యలు, రైతులు, కార్మికులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేపడతామని చెప్పారు. అలాగే పార్టీని జిల్లా వ్యాప్తంగా మరింత బలోపేతం చేసి, గ్రామస్థాయి నుంచి సంస్థాగతంగా విస్తరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# రోడ్లపై పశువులు సంచరిస్తే చర్యలు తప్పవు

● మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి



**నారాయణఖేడ్, జూలై 23:** రోడ్లపై సంచరిస్తున్న పశువుల కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పశువుల యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి హెచ్చరించారు. గురువారం ఆమె ప్రకటనలో పేర్కొంటూ.. పశువుల యజమానులు తమ పశువులను రోడ్లపై వదిలేయకుండా ఇంటి వద్ద లేదా తగిన స్థలంలో కట్టివేయాలని సూచించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రోడ్లపై పశువులను వదిలే యజమానులపై మున్సిపల్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా మున్సిపల్ అధికారులకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# పిల్లర్స్ వేశారు భవనం నిర్మాణం మరిచారు

● శిథిల వ్యవస్థలో మల్లేపల్లి జడ్పిహెచ్ఎస్ పాఠశాల ● పెచ్చులు ఊడుతున్న పట్టించుకోని వైనం



**కొండాపూర్ ప్రజాజ్యోతి** సిపిఎం కొండాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో నేడు మల్లేపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థుల సమస్యల పైన సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్యం మాట్లాడుతూ మల్లెపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులు సమస్యల వలయంలో సతమతమవుతున్న పరిస్థితి ఉందని అన్నారు, విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక పెచ్చులు ఊడి పడుతున్న తరగతి గదిలోనే విద్యను అభ్యసిస్తున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు, శిథిల వ్యవస్థలో ఉన్న పాఠశాలను వెంటనే పునర్ నిర్మించాలని వారు డిమాండ్ చేశారు, పాఠశాల ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యార్థులకు యూనిఫాం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును బట్టి ఆయన సిగ్గుపడ్డారు, విద్యార్థులకు సరిపడా టాయిలెట్స్ ,మరుగుదొడ్లను వెంటనే నిర్మించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు, ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు, నిర్మాణంలో ఆగిపోయిన బిల్డింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని వారు కోరారు, కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వారు గుర్తు చేశారు, వెంటనే ప్రభుత్వ అధికారులు విద్యార్థుల సమస్యలపై స్పందించి సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో సిపిఎం కొండాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండాపూర్ మండల కార్యదర్శి రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొగుడంపల్లి మండలంలో బిఎల్ఏ' ఎస్‌తో (ఎస్ఐఆర్) సమీక్ష సమావేశాన్ని
# నిర్వహించిన మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్

● జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఇండస్ట్రియల్ ఛైర్మెన్ నిర్మలా-జగ్గారెడ్డి

● జహీరాబాద్ పార్లమెంట్ వార్ రూమ్ కో-ఆర్డినేటర్ జూలూరి ధనలక్ష్మి

● జహీరాబాద్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ మొహమ్మద్ గౌస్







**జహీరాబాద్, జూలై 23(ప్రజా జ్యోతి న్యూస్)** మొగుడంపల్లి మండలంలో ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలనే సంకల్పంతో మాజీ మంత్రి వర్యులు, జహీరాబాద్ ఇన్‌చార్జ్ డా॥ఏ. చంద్రశేఖర్ బిఎల్ఏ' ఎస్ తో సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక బిఎల్ఓ అధికారు లతో ప్రతి బూత్ లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతా యుతంగా పనిచేయాలని సూచించారు. మరియు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగేలా పార్టీ శ్రేణులు మరియు బిఎల్ఏ లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యా నికి ఓటే ఆయుధమని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, బిఎల్ఏ' ఎస్ అందరూ సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల అధ్యక్షులు పవన్ రాథోడ్, భాస్కర్ రెడ్డి, ఉదయ్ శంకర్ పాటిల్, జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు నరేష్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్షద్ అలీ, మాజీ మండల అధ్యక్షులు మాక్సూద్ అహ్మద్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు కండెం.నర్సింలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, సర్పంచ్ రాజు, మండల నాయకులు, సర్పంచులు, బిఎల్ఏ' ఎస్, పార్టీ ముఖ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎస్ఐఆర్ విజయవంతానికి కాంగ్రెస్ క్షేత్రస్థాయి కసరత్తు

● బిజిలిపూర్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన



**అందోల్, జూలై 23 (ప్రజాజ్యోతి):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. వట్‌పల్లి మండలంలోని బిజిలిపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన ఎస్ఐఆర్ పర్యవేక్షణ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వజనాల విశ్వాస్ మాట్లాడుతూ.. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా పార్టీ నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన పత్రాలు సమర్పించాలని ప్రజలకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని నాయకులు కోరారు. ఓటరు జాబితా ఖచ్చితత్వమే ప్రజాస్వామ్యానికి బలమని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ అన్ని స్థాయిల్లో సహకారం అందిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయికోడ్ మండల ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ పాటిల్, సంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెద్దపట్ల వినయ్ గౌడ్, మర్వెల్లి మాజీ సర్పంచ్ శరణ్, కేరూర్ సర్పంచ్ సాయి కార్తీక్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఖాజా, నాయకులు పత్రి విఠల్, రవీందర్, లింగారెడ్డి, మోహన్, రాజిరెడ్డి, నాగులపల్లి నారాయణ, బిజిలిపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆరుగొండ సంగప్ప, యువ నాయకులు అరవింద్, శంకర్, శ్రీనివాస్, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంగారెడ్డి రూరల్ పిఎస్ వద్ద వింత ఘటన
# తాళానికి బదులు గేటుకు బేడీలు!

● పోలీస్ స్టేషన్ గేటుకే బేడీలా? నిబంధనలు గాలికి వదిలేశారంటూ స్థానికుల ఆగ్రహం






**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:** సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఓ విచిత్ర సంఘటన స్థానికులను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. ఖతర్నాక్ దొంగలు, నేరస్థులకు వేయాల్సిన బేడీలు... ఏకంగా పోలీస్ స్టేషన్ ప్రధాన గేటుకే దర్శనమిచ్చాయి. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే నియమ నిబంధనలు గాలికి వదిలేసి, గేటుకు బేడీలు వేయడంపై స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ ప్రధాన గేటుకు పోలీసులు బేడీలు వేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సమాజంలో తప్పు చేసిన వారిని సన్మార్గంలో పెట్టాల్సిన రక్షక భటులే ఇలా ప్రవర్తించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా రక్షణకు దర్పణంగా నిలవాల్సిన పోలీస్ స్టేషన్ గేటుకే తాళానికి బదులు బేడీలు వేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్పందించిన ఒక పోలీస్ అధికారి వింత వివరణ ఇచ్చారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇతరులు తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని, పైగా ఈరోజు ఉన్నతాధికారుల పర్యటన ఉన్నందున గేటుకు తాళం వేయమని సిబ్బందికి చెప్పామని తెలిపారు. అయితే, సిబ్బంది పొరపాటున తాళానికి బదులుగా బేడీలు వేసి ఉంటారని విచారం వ్యక్తం చేస్తూ, వెంటనే వాటిని తొలగించారు.

## రోడ్డుకు పెద్ద గుంత.. ఎప్పుడు ఏ ప్రమాదం
# ముంచుకొస్తుందోనని ప్రయాణికుల ఆందోళన

**కల్హేర్, జూలై 23 (ప్రజా జ్యోతి)** సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండల పరిధిలోని పోచాపూర్ చౌరస్తా-- కృష్ణాపూర్ ప్రధాన రహదారిపై జెమ్లా తండా సమీపంలో రోడ్డుమధ్య భారీ గుంత ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రతిరోజూ ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలతో పాటు ప్రజా రవాణా వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల భయం నెలకొంది. రోడ్డుపై ఏర్పడిన గుంత కారణంగా ఇప్పటికే పలువురు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు స్థానిక గ్రామస్తులు గుంతలో చెట్ల కొమ్మలు ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు. అయితే రాత్రి వేళల్లో గుంత స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి గుంతను తక్షణమే పూడ్చి రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## కోనంపేట్‌లో మెడ్వన్ సచంద వారి
# సౌజన్యంతో ఆటసామాగ్రి పంపిణి




**హత్నూర 23జులై (ప్రజాజ్యోతి)** మండల పరిధిలో ని కోణంపేట ప్రాథమిక పాఠశాల లో గురువారం నాడు మెడివిన్ స్వచ్ఛంద సంస్థ వారి సౌజన్యంతో స్టేషనరీ మరియు క్రీడా సామాగ్రి విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మెడ్విన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పటాన్ చెరువు మండలం ప్రాథమిక కొన్నంత పాఠశాల చిన్న కంజర్ల, ప్రాథమిక పాఠశాల, ఐనోల్ పాఠశాలలో పార్కర్ హనీ ఫిన్ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ వారు ఎడ్యుకేషన్ కిట్టు అలాగే స్పోర్ట్స్ మెటీరియల్ ఇవ్వడం జరిగింది స్కూల్ బ్యాగ్ బుక్స్ కంపాస్ బాక్స్ పెన్నులు పెన్సిల్లు షాప్ నగర్ రేసర్ పలకలు వంటి వస్తువులు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయుటకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు గ్రామంలోని పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని మా యొక్క ముఖ్య ఉద్దేశం ఈ విధంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని కోరుకుంటున్నామని చెప్పారు గత 5 సంవత్సరాలనుండి ఎడ్యుకేషన్ కిడ్స్ తోపాటు పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు మేము ఎంచుకున్న పాఠశాలలో చాలా మార్పు వచ్చింది ఇలాంటి మంచి మార్పు రావడానికి కమ్యూనిటీ ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు అందరి సహకారం ఉంటేనే సాధ్యపడుతుంది అలాగే చిన్నారుల తలిదండ్రులు కూడా ఆ శక్తి చూపుతున్నారు అని అనుకుంటున్నాను ఎందుకు అంటే పాఠశాలలో పిల్లల సంఖ్య పెరుగుతుంది ప్రభుత్వ బడులను ఆదర్శ బడుల్లా తీర్చిదిద్దడమే మా యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మేడ్వాన్ స్వచ్ఛంద సంస్థ చాలా మంచి సేవలను అందిస్తున్నారు మా పాఠశాల చిన్నారులకు చాలామంది తల్లిదండ్రులు కూడా ప్రైవేటు బడిలా అనుకుంటున్నారు.

# నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

☆ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

☆ ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బత్తుల అభిషేక్ భాను

సిద్దిపేట అర్బన్, జూలై23 (ప్రజాజ్యోతి):- నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బత్తుల అభిషేక్ భాను అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అభిషేక్ బాను మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీలు దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీశాయని అన్నారు. ఈ ఘటనల కారణంగా పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా, బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఢిల్లీలో జరిగిన విద్యార్థులపై దాడులపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. చీూను రద్దు చేయాలని, ఎదీూా బిల్లును వెంటనే వెనక్కి




తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 24న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు ఎస్ఎఫ్ఐ, వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు, ప్రజాసంఘాలు స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌కు మద్దతు తెలపాలని బత్తుల అభిషేక్ భాను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చెపియాల సంతోష్ నాయకులు సంజయ్ మరియు విజయ్ నవదీప్రుతిన్ రిషి కిరణ్ వంశీ లక్ష్మణ్ సాయి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్ షిప్, రీయింబర్స్ మెంట్‌లను వెంటనే విడుదల చేయాలి

☆ ప్రభుత్వ పాఠశాలల కుదింపును విరమించుకోవాలి

☆ ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

☆ ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి జనార్ధన్

సిద్దిపేట అర్బన్, జులై 23(ప్రజాజ్యోతి):- పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల కుదింపును విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి జనార్ధన్‌అన్నారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాజ్ కుమార్ (ూూ)కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అన్నారు. విద్యాహక్కు చట్టం (ూఱు) ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కళాశాలల యాజమాన్యాలు ఫీజులు అందక జీతాలు ఇవ్వలేక నానా





అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో 27 వేల పాఠశాలలను 4 వేలకు తగ్గిస్తామని అంటున్నారని ప్రభుత్వ పాఠశాలల కుదింపు నిర్ణయాలను ఉపసంహరించుకొని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా విద్యాశాఖ ఆదేశాలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తు విద్యను వ్యాపారం చేస్తున్నారని వారిని నియంత్రించడంలో విద్యాశాఖ అధికారులు విఫలం అవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉపశమనం కల్పించాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 29న "విద్యార్థి గర్జన" పేరుతో సిద్ధిపేట కలెక్టరేట్ ముందు భారీ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, విద్యార్థులు, యువజనులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సంగెం మధు,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్,జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్,జిల్లా కోశాధికారి ఆకుల శిరీష,జిల్లా నాయకులు చట్ల సమ్మయ్య,ఎస్ కె యాసిన్,గిరుక అభినయ్, పోతుగంటి ప్రశాంత్,బత్తుల రఘు,సుమన్,సంజయ్ తదితరులు పాల్గొన్నారు..

## బాధిత కుటుంబానికి
# అధికారులు నష్టపరిహారం అందేలా చూడాలి

☆ గాంతి శ్రీనివాస్ కు 20 వేల ఆర్థికసహాయం ☆ వ్యాపారావేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి

సిద్దిపేట అర్బన్, జులై 23(ప్రజాజ్యోతి):- వీధి కుక్కల దాడిలో గొర్రెలు మేకలను కోల్పోయి తీవ్ర ఆర్థిక నష్టంలో ఉన్న బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి లో ఇటీవల





వీధి కుక్కల దాడిలో గొర్రెలు, మేకలను కోల్పోయిన గాంతి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను గురువారం వంగ రాజేశ్వర్ రెడ్డి పరామర్శించి 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేకలను కోల్పోయిన దురదృష్ట సంఘటనతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని ధైర్యం కోల్పోవద్దని అండగా ఉంటామని అన్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యను తక్షణమే అధికారులు ప్రభుత్వశీ దృష్టికి తీసుకువెల్లి బాదిత కుటుంబానికి నష్ట పరిహారం అందేలా చూడాలని కోరారు.

# చెట్ల పెంపకం భవిష్యత్తుకు భరోసా

☆ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

☆ జడ్పీహెచ్ఎస్‌లో మొక్కలను నాటిన సర్పంచి, హెచ్ఎం ☆ మధ్యాహ్న భోజనం, వంటగది పరిశీలన

నంగునూరు, జూలై 23 (ప్రజా జ్యోతి):- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన వాతావరణం అందించవచ్చునని నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి , నంగునూరు సర్పంచి బాల పోచయ్య అన్నారు గురువారం పాఠశాల ఆవరణలో పలు రకాల మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణలో విద్యార్థులు, యువత పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని సూచించారు. పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు గాలి కాలుష్యాన్ని తగ్గించి జీవావరణాన్ని రక్షిస్తాయని తెలిపారు. వాతావరణ మార్పుల





ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మొక్కల పెంపకం అత్యవసరమని చెప్పారు. ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను పెంచే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. పచ్చదనమే ప్రగతికి పునాది అని మరోసారి చాటిచెప్పిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించింది. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వంటగదిలో పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, వంట నిర్వహణ తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కోల శ్రీధర్ గౌడ్, వార్డు సభ్యులు రచ్చ సిద్దు, గోనెపల్లి శివప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చేబర్తి గ్రామంలో ఎల్‌నినోపై అవగాహన కార్యక్రమం

☆ మండల వ్యవసాయ అధికారి రాము

మర్కూక్ జులై 23(ప్రజాజ్యోతి): మర్కుక్ మండలం చేబర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి రాము రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా పంట మార్పిడి విధానాన్ని అనుసరించి అపరాలు, కూరగాయల పంటలు మరియు నూనెగింజల పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే ప్రతి రైతు తన పొలంలో పంట కుంటలను నిర్మించుకొని వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా అవసరమైన సమయంలో పంటలకు జీవనాధార నీటిని అందించవచ్చని వివరించారు. వ్యవసాయ శాఖ సూచించే శాస్త్రీయ సాగు పద్ధతులను పాటిస్తూ, వాతావరణ హెచ్చరికలను గమనించి పంటల ప్రణాళిక



రూపొందించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ర్యాకం యాదగిరి, గ్రామ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రాజు, ఎం.ఎల్.హెచ్.పి. ప్రవిత, వార్డు సభ్యులు పోయిల లావణ్య ఆంజనేయులు, పాలే శేఖర్, లింగని కనకయ్య, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, రాణి, ఆశ వర్కర్లు బబ్బురి లత, ధనలక్ష్మి, ఆఫ్ ఏ బబ్బూరి లలిత, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ బబ్బురి రాములు గౌడ్, జాలని బాల నరసయ్య, పొయ్యల మల్లేశం, గడమల్ల చంద్రం ,గ్రామ రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

# విద్యార్థులపై దాడి కేంద్ర ప్రభుత్వ పథనానికి నాంది

☆ బేటి బచావో బేటి పడావో నినాదం అటకెక్కింద

☆ గ్లోబరిన్ సంస్థతో పెట్టుకుంటే పతనం కాయం అప్పుడు బిఆర్ఎస్ అధికారం కోల్పోగా, ఇప్పుడు బిజెపి కొట్టుకపోవడం ఖాయం

☆ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి

ములుగు, జూలై23 (ప్రజా జ్యోతి) విద్యార్థుల పై లాటి జులిపించడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పతనానికి నాంది అని,బేటి బచావో బేటి పడావో నినాదం అటకెక్కింద,గ్లోబరిన్ సంస్థతో పెట్టుకున్న బి.ఆర్.ఎస్ పతనమైంది,గ్లోబరిన్ సంస్థతో సంబంధాలు కుదుర్చుకొని నీట్ పేపర్ లీక్ చేయడం తో కేంద్ర సర్కార్ పతనం ప్రారంభమైందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి పేర్కొన్నారు.గురువారం మండల కేంద్రమైన ములుగులో మండల పార్టీ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె రాజీవ్ రహదారిపై నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేపర్ లీక్ పై విద్యార్థులు ఉద్యమిస్తే అరెస్టు చేసి లాఠీలు జులిపించి ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.విద్యార్థుల భవిష్యత్తు నాశనమైపోతుంటే ప్రధానమంత్రి ఎందుకు మాట్లాడటం లేదని,పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఎంపీ ప్రియాంక గాంధీలపై పోలీసుల తీరు సరైంది కాదన్నారు.గతంలో తెలంగాణలో ఇంటర్ విద్యార్థుల చావులకు కారణమైన గ్లోబరీనా సంస్థ తో ఏ ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సంబంధాలు కొనసాగిస్తుందో కానీ కేంద్ర ప్రభుత్వ పతనం ప్రారంభమైంది






అన్నారు.ప్రధానమంత్రి మోడీ,విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్తా, నరసింహారెడ్డి, జడ్పి మాజీ కోఆప్షన్ సభ్యుడు సలీం, పిఏసిఎస్ మాజీ చైర్మన్ పోచిరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాస్, వాజీద్, సర్పంచులు ఎడ్ల పోచయ్య, కృష్ణ, సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, మోహన్, ప్రదీప్ రెడ్డి, సత్తిరెడ్డి, రంగ సత్యనారాయణ, మణి పవన్ రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకట్, కనకయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లీక్..రాహుల్ అరెస్టును
# ఖండించిన చేర్యాల కాంగ్రెస్

చేర్యాల,జూలై 23(ప్రజాజ్యోతి): నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి నిరసనగా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ గురువారం జనగామ నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశానుసారం చేర్యాల పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువతపై పోలీసులు అత్యంత కర్కశంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.



యువతకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చుంచనకోటలో ప్లాస్టిక్ నివారణపై అవగాహన సదస్సు

చేర్యాల, జూలై 23 (ప్రజాజ్యోతి): ప్లాస్టిక్ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం చేర్యాలమండలంలోని చుంచనకోట గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రతి షాపుకు తిరిగి ప్లాస్టిక్ వినియోగం వల్ల వచ్చే అనర్థాల గురించి ప్రజలకు వివరించారు. బస్టాండ్ వద్ద ఉన్న హోటళ్లలో టీ కొరకు ప్లాస్టిక్ కప్పులు వాడకుండా స్టీల్ గ్లాసులు లేదా సీసా గ్లాసులు వాడాలని హోటల్ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వడ్లకొండ వెంకటేశం, పండుగ మల్లేశం, మంద వెంకటరెడ్డి, కమలేష్, పంచాయతీ సెక్రెటరీ రాంబాబు, కారోబార్ రాజు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అగ్ర నేతల అరెస్టులను నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

మర్కూక్ , జూలై 23 (ప్రజాజ్యోతి ) కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టులను నిరసిస్తూ మర్కుక్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రాల నర్సింలు నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని, నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ సంబంధిత కేంద్ర మంత్రిని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ములుగు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ తాండ కనకయ్య గౌడ్ , మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రాల నర్సింలు, సిద్దిపేట జిల్లా ఉప అధ్యక్షుడు బబ్బూరి మల్లేశం, మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ ప్రతిపక్షాల గొంతును అణిచివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం, ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేసి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకుని, నిర్బంధంలో ఉన్న వారిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.





లేనిపక్షంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ములుగు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ తాండ కనకయ్య గౌడ్ , మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రాల నర్సింలు, సిద్దిపేట జిల్లా ఉప అధ్యక్షుడు బబ్బూరి మల్లేశం, మర్కుక్ గ్రామ శాఖ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, ఇప్పలగూడెం గ్రామ సర్పంచ్ మంద నాగిరెడ్డి, పాములపర్తి మాజీ సర్పంచ్ తిరుమల్ రెడ్డి, పాతూరు మాజీ సర్పంచ్ నర్సింలు, బిక్షపతి,ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇసుకంటి బాబు, తాడూరి సుధాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలి

**తాండూర్ సబ్ డివిజనల్ వ్యవసాయ అధికారిని కె.అరుణ**



**తాండూరు జులై 23 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు సబ్ డివిజనల్ వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎడిఎ కె అరుణ మండల వ్యవసాయ అధికారులతో పాటు, క్లస్టర్ వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యం కారణంగా రైతులకు సరైన సూచనలు ఇస్తు ప్రత్యేకంగా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు.వర్షాలు తక్కువ మోతాదులో కురవడంతో పంటల పెట్టుబడులను స్థానిక వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పెట్టుబడి పెట్టే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిదంగా ప్రత్యామ్నాయ పంటలు, నీటి యాజమాన్యం గురించి రైతులకు తగిన సూచనలు చేయాలన్నారు. అదేవిదంగా వరి పంట సాగు చేసే రైతులు తక్కువ విస్తీర్ణంలో సాగు చేసే విధంగా చూడాలన్నారు. వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలు ఉంటాయనేది వాతావరణ శాఖ సూచనలను రైతులుకు తెలియజేయాలన్నారు. రైతులకు అవసరమైన యూరియా, డిఎపి ఎరువుల నిల్వలు తగిన మోతాదులో ఉండే లాగున చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం పెండింగ్ లో ఉన్న పనులన్నీ తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో తాండూర్, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల వ్యవసాయ అధికారులు కొమురయ్య,పవన్ ప్రీతం,శ్వేతా రాణి, అనిత,అలాగే వివిధ మండలాలకు చెందిన ఏఈవోలు ఉన్నారు.

## అల్లాపూర్ పంచాయతీలో విద్యుత్ బకాయి చెల్లించేందుకు తీర్మానం

- రూ1లక్ష 49 వేల 352 రూపాయల చెక్కు జారీ చేశాం
- అల్లాపూర్ సర్పంచ్ వడ్డే చెన్నప్ప



**తాండూరు జులై 23 ప్రజా జ్యోతి :** ప్రస్తుతం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న విద్యుత్ బకాయిలు చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారుల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు అల్లాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వడ్డె చెన్నప్ప అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యుత్ బకాయిలు చెల్లించేందుకు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చెప్పారు. గ్రామంలోని వీధి దీపాలు, మంచినీటి సరఫరా పంపు మోటార్లకు సంబంధించిన విద్యుత్తు బకాయిలు గత నాలుగు సంవత్సరాల నుండి రూ 15 లక్షల మేరకు పెండింగ్లో ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం అధికారుల సూచనల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగ ప్రసాద్ సమక్షంలో గ్రామ పంచాయతీ నిధుల నుండి రూ 1లక్ష 49 వేల 352 రూపాయల విద్యుత్ బకాయి బిల్లును చెల్లించేందుకు గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానించిందని చెప్పారు. ఇక మిగిలిన విద్యుత్ బకాయి డబ్బులు కూడా వాయిదాల రూపంలో చెల్లించేందుకు తీర్మానించామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పలువురు వార్డు సభ్యులు ఉన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదు

- ప్రజల హక్కులను నెలరాస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వం గద్దె దిగిపోవాలి
- కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగగూడెం సుదర్శన్ గౌడ్
- ఢిల్లీలో రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీల అరెస్టులు అప్రజాస్వామికం
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి
- రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ కొత్తూరు మున్సిపాలిటీ,మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా,రాస్తారోకో
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న బీజేపీ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటేనే రాజీనామా చేయాలి





**కొత్తూర్ జులై 23 (ప్రజాజ్యోతి) :** నీట్ పరీక్ష పేపర్ లీకేజ్తో పాటు దేశవ్యాప్తంగా జరిగిన పలు పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీల వ్యవ హారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, విద్యా ర్థుల న్యాయమైన హక్కులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేసిన ఏఐసీసీ నాయకులు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ కొత్తూరు మున్సిపాలిటీ మరియు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగగూడెం సుద ర్శన్ గౌడ్, మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తైన విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన పేపర్ లీకేజీ ఘటనలు అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పరీక్షల పారదర్శకతను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదివి పరీక్షలు రాస్తే,పేపర్ లీకేజీల కారణంగా వారి శ్రమ వృథా అవుతోందని అన్నారు.విద్యార్థులకు న్యాయం చేయాలని,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు.ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని,ఆ హక్కును కాలరాస్తూ కాంగ్రెస్ నాయ కులపై అక్రమ కేసులు పెట్టడం,అరెస్టులు చేయడం బీజేపీ ప్రభుత్వ అధికార దుర్వి నియోగానికి నిదర్శనమని విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తును కాపా డాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను తీసుకురావాలని,పేపర్ లీకేజీలపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకో వాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయా లని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరమోని దేవేందర్ ముదిరాజ్, కమ్మరి జనార్దన్ చారి, కర్రోళ్ల సురేం దర్, ఎమ్మె సత్తయ్య, మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్,పీర్లగూడెం మహేష్ గౌడ్, ఎస్బి పల్లి సురేష్, భరత్, పాశం కృష్ణ,ఎస్కే కాజా,చిలకమర్రి నర సింహ, జగన్, విజయపాల్ రెడ్డి,కూన శివకుమార్ గౌడ్,చింత సాయి తేజశ్వర్, పెంటయ్య,నరసింహ గౌడ్, బాలరాజు,రాజు, శివ, లక్ష్మయ్య,తిగాపురం ఆంజనే యులు, సుమన్,అనిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ముట్టడించిన బీవీఎం నాయకులు







- విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి నియామకం, ఆర్టీఈ చట్టం అమలు, ఫీజు నియంత్రణ చట్టం కోసం డిమాండ్
- అనంతరం నాయకుల అరెస్ట్

**పరిగి/హైదరాబాద్, జూలై 23 (ప్రజాజ్యోతి) :** భారతీయ విద్యార్థి మోర్చా (బీవీఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాన్ని ముట్టడించి విద్యా రంగ సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని, విద్యా హక్కు చట్టం--2009 ప్రకారం అన్ని పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లను అమలు చేయాలని, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులను నియంత్రించే చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీవీఎం రాష్ట్ర అధ్యక్షుడు భూంపల్లి రవితేజ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ క్షీణించిందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పాటు అనేక గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని విమర్శించారు. విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. బీవీఎం ఉమ్మడి రాష్ట్రాల కోఆర్డినేటర్ బట్టు శ్రీధర్ మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చడం వల్ల సామాన్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం అమలు సక్రమంగా జరగడం లేదని, అన్ని పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్, యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు.

కార్యక్రమంలో భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్, బీవీఎం కార్యదర్శి ప్రవీణ్, రాష్ట్ర నాయకులు అరుణ్ కుమార్, శ్యామ్, మనోజ్, అలెక్స్, సందీప్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, పులి కల్పన తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని అసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# నీట్ పేపర్ లీక్‌పై పరిగిలో నిరసన జ్వాల

- విద్యార్థులపై లాఠీచార్జీని ఖండించిన సీపీఎం, ఎస్ఎఫ్ఐ నేతలు - ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్





**పరిగి, జూలై 23 (ప్రజాజ్యోతి) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ కుంభకోణం, విద్యార్థులపై జరిగిన పోలీసు దమనకాండ, ప్రజాస్వామ్య హక్కుల అణచివేత అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య అన్నారు. గురువారం పరిగి పట్టణంలో సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ సహా వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హెచ్. సత్యయ్య, అవాజ్ సంఘం జిల్లా నాయకులు ఎండీ హబీబ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థులు ఎన్నో సంవత్సరాల పాటు కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రశ్నాపత్రాల లీకేజీల ద్వారా వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నీట్ పేపర్ లీక్ కుంభకోణం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు, పరీక్షల నిర్వహణలో నెలకొన్న అవినీతి, నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా వరుసగా పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అవుతున్నప్పటికీ వాటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై సమాధానం చెప్పకుండా బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

నీట్ పేపర్ లీక్‌పై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిర్వహించిన "చలో పార్లమెంట్" కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువజన సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రశ్నాపత్రాలు లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, న్యాయం కోరుతున్న విద్యార్థులపై లాఠీలు ఎక్కుపెట్టడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా అణచివేయడం బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని విమర్శించారు. నిరుద్యోగం, విద్యా రంగ సంక్షోభం, పెరుగుతున్న ఫీజులు, పరీక్షల అక్రమాలపై సమాధానం చెప్పలేని కేంద్ర ప్రభుత్వం పోలీసు దమనకాండతో యువత గొంతును నొక్కివేయాలని చూస్తోందని ఆరోపించారు. ఉద్యోగాలు, పారదర్శక పరీక్షా వ్యవస్థ, విద్యా హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను శత్రువులుగా చూడటం సిగ్గుచేటని అన్నారు. నీట్ పేపర్ లీక్, పోటీ పరీక్షల అక్రమాల కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలను తీసుకురావాలని కోరారు.

అదేవిధంగా ప్రజల సమస్యలపై శాంతియుతంగా ఉద్యమిస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తూ, ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కుల కోసం పోరాడే వారిని అణచివేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.

నీట్ పేపర్ లీక్ కుంభకోణంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులపై లాఠీచార్జీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల నాయకులు ఎండీ హబీబ్, యాదయ్య, అనిల్, శ్రీధర్, చరణ్, రోహిత్, ప్రేమ్, శివ, భానుప్రకాశ్, సాయి, గణేష్, జస్వంత్, ముజమిల్, నంద, చారి, హర్ష, సమీర్, అత్తా ఉల్లా, కలీం, సుమేర్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు సవరణ ప్రక్రియలో బిఎల్ఎల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం - కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసిన ఎమ్మెల్యే బీఎంఆర్







**తాండూరు జులై 23 ప్రజా జ్యోతి :** ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన బిఎల్ఎ పాత్ర కీలకం అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి దిశ నిర్దేశం చేశారు.గురువారం రోజు తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తాండూరు పట్టణ బిఎల్ఎ లతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బీఎంఆర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇదివరకు కొనసాగుతున్న సర్ సర్వే ప్రక్రియలో భాగంగా ఎన్నికల అధికారుల సూచనల మేరకు ఇంకో 10రోజుల కాలంలో మీ పాత్ర కీలకంగా ఉండాలన్నారు.ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైనది దీంతో ప్రజాస్వామ్య హక్కు కావున అర్హత ఉన్న ప్రతి ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సర్ పర్యవేక్షకులు కోటం వినయ్ రెడ్డి, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సర్ కన్వీనర్ పురుషోత్తం రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ వార్డులకు చెందిన బిఎల్ఎలు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్-నినోపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయాలి - చేవెళ్లలో వ్యవసాయ శాఖ అధికారి శంకర్ లాల్





**చేవెళ్ల, జూలై 23 (ప్రజాజ్యోతి) :** ఎల్-నినో ప్రభావంతో ఈ వానాకాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ సూచించారు. వానాకాలం--2026 అత్యవసర పంటల ప్రణాళికలపై గురువారం చేవెళ్ల రైతు వేదికలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు తొందరపడి విత్తనాలు వేయ కుండా నేలలో తగిన తేమ ఉన్న తర్వాతే విత్తాలని, తేమ లేని నేలలో ఎరువులు వేయరాదని తెలిపారు. వర్షం కురిసిన 24 నుంచి 48 గంటల తర్వాత మాత్రమే టాప్‌డ్రెస్సింగ్ ఎరువులు వేయాలని సూచించారు. సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా దిగుబడి నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. వర్షపు నీటిని పొలంలోనే నిల్వ చేసేందుకు కాంటూర్ బండ్లు, ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేయాలని, అంతర పంటలు సాగు చేయ డంతో పాటు మల్చింగ్ ద్వారా నేల తేమను సంరక్షించాలని రైతులకు సూచిం చారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన మేరకే ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని పేర్కొన్నారు. జూలై 31 తర్వాత సాగుకు అనువుగా కంది, పెసర, మినుము, నువ్వులు, జొన్న, సజ్జ, రాగి, కొర్రలు, సామలు, అరికెలు వంటి తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్య క్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, వెటర్నరీ వైద్యాధికారి, హార్టికల్చర్ అధికారి, ఏఈవోలు గాయత్రి, ప్రతిభ వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అంకిత స్వచ్ఛంద సంస్థ సేవ మరువలేనిది

- గ్రామీణ కార్మికులకు ఎంతో తోడ్పాటు
- గ్రామ సర్పంచ్ వడ్డె చెన్నప్ప



**తాండూరు జులై 23 ప్రజా జ్యోతి :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న లేబర్ కార్డు ప్రక్రియను అంకిత స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా చేపట్టడం అభినందనీయమని అల్లాపూర్ గ్రామ సర్పంచ్ చెన్నప్ప సూచించారు. గురువారం రోజు జరిగిన లేబర్ కార్డు నమోదు ప్రక్రియకు అయినా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో వివిధ పనులలో కార్మికులుగా పనిచేస్తున్న అందరూ కూడా లేబర్ కార్డు పొందవలసిన అవసరం ఉందన్నారు.

లేబర్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి కూడా కుటుంబ యజమాని అనుకుని పరిస్థితులలో మరణించిన ఆ కుటుంబం వీధి నా పడకుండా ఎంతో తోడ్పడుతుందని సూచించారు. అదేవిదంగా కార్డు ఉన్న వ్యక్తి కుటుంబంలోని ఇద్దరు కూతురుల వివాహం, కాన్పుల సమయంలో ఒక్కొక్కరికి రూ.30 వేల సహాయం పొందవచ్చు అని చెప్పారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నర్సింలు గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నాగ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## ఢిల్లీ ఘటనకు నిరసనగా తుర్కయంజాల్‌లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



**అబ్దుల్లాపూర్ మెట్టు జూలై 23 (ప్రజాజ్యోతి) :** ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి వ్యతిరేకంగా తుర్కయంజాల్ లో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఆందోళన చేపట్టారు.జీహెచ్ఎంసీ 53,56 డివిజన్ బిజెపి అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో తుర్కయంజాల్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశమైన బీజేపీ నాయకులు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎలిమినేటి నరసింహారెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం ఎదుట చేపట్టిన నిరసన ప్రజాస్వామ్య మర్యాదలకు విరుద్ధమని విమర్శిం చారు. నీట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో యువత దృష్టి మరల్చే విధంగా రాజకీయ నిరసనలు నిర్వహించడం సరికాదన్నారు. ప్రధానమంత్రి గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం దేశ ప్రజల మనోభావాలను కించపరిచే చర్యగా అభివర్ణించారు. ఇటువంటి చర్యలను బీజేపీ కార్యకర్తలు తీవ్రంగా ఖండిస్తారని, అవసరమైతే దేశవ్యాప్తంగా తగిన విధంగా ప్రజాస్వామ్యబద్ధంగా స్పంది స్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.దేశ ప్రజాస్వామ్య విలువలను ప్రతి రాజకీయ పార్టీ గౌరవించాలని, వ్యక్తిగత విమర్శలు, అవమానకర వ్యాఖ్యలను మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బచ్చిగళ్ల రమేష్, కొండ్రు పురుషోత్తం, నోముల కార్తీక్ గౌడ్,కొంతం బాల్‌రెడ్డి, మల్లెల ప్రేమ్, నందగిరి సురేష్,గుండ కృష్ణ,నాయిని సంజీవరెడ్డి,మడుగుల బాలకృష్ణ,కంచనాని దాసు,సురేష్ సాగర్, మలేళ్ల రమేష్,అజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్‌పై బూత్ ఇంచార్జ్‌లతో ఎమ్మెల్యే సమీక్ష

- పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి, జూలై 23 (ప్రజాజ్యోతి) :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే-ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బూత్ ఇంచార్జ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీఏసీ చైర్మన్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ,టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి జగదీశ్వర్ గౌడ్ పలువురి కార్పొరేటర్లతో కలిసి పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని బూత్ ఇంచార్జ్‌లకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి,ఒక్క కుటుంబం కూడా మిస్ కాకుండా పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. ఈ సర్వే డేటా ఆధారంగానే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని, కాబట్టి బాధ్యతగా పనిచేయాలని కోరారు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని అన్ని బూత్‌లలో ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలంతా సర్వే సిబ్బందికి సహకరించి తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమీక్ష సమావేశంలో డివిజన్ ముఖ్య నాయకులు, బూత్ ఇంచార్జ్‌లు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వివేకానంద విద్యానికేతన్ విద్యార్థులకు ఆల్ ఇండియా ర్యాంకులు:-

కరీంనగర్ టౌన్ జూలై 23 (ప్రజా జ్యోతి ) స్థానిక భగత్ నగర్ వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థల విద్యార్థులు ఎడోస్ ఐఐటి వారు నిర్వహించిన పరీక్షల్లో కూకట్ల సహస్ర(10 వర్యాంకు), టి. భవిష్య(19వర్యాంకు) లతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి




ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య మాట్లాడుతూ గడిచిన రెండు సంవత్సరాల నుంచి జిల్లాలో ప్రప్రధమంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధనను ఏడోస్ ఐఐటి కరికులంతో అందిస్తున్నామన్నారు.విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ బయాలజీ సబ్జెక్టులలో చక్కని సామర్థ్యంతో ముందుకు వెళుతున్నారని, భవిష్యత్తులో ప్రతిష్టఐఐటీలో మెడికల్ లో సీట్లు సాధించేందుకు మా కరికులం బలమైన పునాదిని అందిస్తుందని,అలాగే ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ సన్మానించి, శుభాభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ,వైస్ ప్రిన్సిపాల్,ఏ వో ,ఐఐటి అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వంతడ్పుల, కండికట్కూర్, వల్లంపట్ల గ్రామాలలో ఆకస్మికంగా మరణించిన వారి కుటుంబాలను పరామర్శించిన బెంద్రం.తిరుపతి రెడ్డి

ఇల్లంతకుంట జూలై 23(ప్రజజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల వల్లంపట్ల గ్రామంలో కొలుపాక.చంద్రయ్య , కందికట్కూర్ గ్రామంలో గుగ్గిళ్ల.దేవయ్య వంతడుపుల గ్రామంలో కొండికొప్పుల.రజిత అకస్మాత్తుగా మరణించగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి 50 kg బియ్యం బస్తాలు బి టి అర్ ఫౌండేషన్ ద్వారా గురువారం రోజు అందజేసిన బెంద్రం.తిరుపతి రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెద ప్రజలకు ఏ కష్టం వచ్చినా అపదొచ్చిన మీకు ఎల్లప్పుడూ





అండగా ఉంటూ సహాయలు చేస్తూనేఉంటామన్నారు, ఈ సహాయ సేవాలలో ఫౌండేషన్ సేవాప్రాతినిధులు భూమళ్ళ . ప్రశాంత్, రాచకొండ.రోశాలు, ఎలగందుల.సాగర్, బొయిని.రంజిత్, కర్ల.లక్ష్మణ్, లకపాక.నరసయ్య, కర్ల.అరుణ్, దూది.శ్రీనివాస్, ఉప్పులేటి.ప్రశాంత్, ఎలుక.సాంసన్, మల్లమరి.కనుకరాజ్, మల్లమరి.సమెందర్ , మల్లమరి.రాజు, గోత్రాల.మహేందర్, కోల్పక.రాజు, లకపాక.ప్రవీణ్, కొల్పకా.ప్రకాష్ , గుగ్గిళ్ల.పోచయ్య, గుగ్గిల్ల.లచయ్య, సవనాపెల్లి.మల్లయ్య , కొందికొప్పుల.శ్రీకర్, సావనపెల్లి తిరుపతి, కొండికొప్పుల.రాజయ్య, తదితరులు పాలుగోన్నారు.

## గొల్లపల్లిలో యువకుడు ఆత్మహత్య....

### నా చావుకు మోడీ కారణం సూసైడ్ నోట్.....



ఎల్లారెడ్డిపేట జూలై 23 (ప్రజా జ్యోతి ) ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు పిట్ల వంశీ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు .అతడు రాసిన సూసైడ్ నోట్లో మోదీ నా ఆత్మకు హత్యకు కారణమని ఎస్ఐపి పత్రంపై రాసి ఆత్మహత్య చేసుకున్నాడు .వివరాలు తెలియాల్సి ఉంది పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ రెడ్డి తెలిపారు.

## గల్ఫ్ లో మృతి చెందిన దాసు కుటుంబానికి ఆర్థిక చేయూత

### పది వేల నగదు తో పాటు రైస్ బ్యాగ్ పంపిణీ

కొనరావుపేట, జూలై.23(ప్రజాజ్యోతి) కొనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన దోబ్బల దాసు, గత నెల రోజుల క్రితం గల్ఫ్ లో మృతి చెందిన దాసు కుటుంబాన్ని అదే సంస్థలో కలిసి పనిచేసిన తన స్నేహితులు మారుపాక గ్రామానికి చెందిన దుద్దేటి పోచయ్య తన మానవత్వాన్ని చాటుకుని బాధిత కుటుంబానికి



పదివేల నగదు తో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. దాసు ఆకస్మిక మరణంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని వారి కష్టకాలంలో తన వంతు బాధ్యతగా ఈ సహాయాన్ని అందించినట్టు స్నేహితులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాసుతో కలిసి పనిచేసిన రోజుల జ్ఞాపకాలు ఎప్పటికీ మరువలేమని ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఈ ఆర్థిక సహాయం అందించిన గల్ఫ్ స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పల్లిమక్త మాజీ సర్పంచ్ జిన్నా అనిల్, దొబ్బల నరేష్, కాదను నరసయ్య, లింగయ్య ,గంగయ్య, ఆనందం ,రాజయ్య, తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకు సాగాలి

### సాన్వి నవోత్సవం ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ టౌన్ జూలై 23 (ప్రజా జ్యోతి ) విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పెంపొందించుకోవాలని సూచించారు. సాన్వి జూనియర్ కాలేజ్ & డిఫెన్స్ అకాడమీ విద్యార్థులను పోటీ ప్రపంచానికి అనుగుణంగా తీర్చిదిద్దుతూ విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సహించడం అభినందనీయమని లక్షణాలు, దేశభక్తిని పెంపొందించేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. " కం టూ లెర్న్ గో టూ సర్వ్ అ మలు చేస్తూ విద్యార్థులను పోటీ ప్రపంచానికి సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులలో





అన్నారు. కరీంనగర్‌లోని సాన్వి జూనియర్ కాలేజ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం కొత్తపల్లి రోడ్, రేకుర్తిలోని స్వాగత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "నవోత్సవం–2026" సాంస్కృతిక వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి భారత నిర్మాణ శిల్పులని అన్నారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవా దృక్పథం కొనియాడారు.

ట్రెడిషనల్ యోగా గురువు మెహర్ కుశల్ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. కళాశాల చైర్మన్ అరంశెట్టి మునీందర్ మాట్లాడుతూ, విద్యార్థులను కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దడమే కాకుండా దేశానికి సేవ చేసే బాధ్యతగల పౌరులుగా తయారు చేయడమే సాన్వి జూనియర్ కాలేజ్ & డిఫెన్స్ అకాడమీ లక్ష్యమని అన్నారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నవోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, గుంటుపల్లి స్వామి, వంశీధర్ రెడ్డి అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ భర్త మృతి..కరీంనగర్‌లో ఉద్రిక్తత

- ఎమ్మెల్యే కార్యాలయం ముందు ఆత్మహత్యాయత్నం చేసిన రాజేందర్ రెడ్డి
- పది రోజులుగా చికిత్స పొందుతూ మృతి
- సివిల్ ఆస్పత్రి ముందు కుటుంబ సభ్యుల ధర్నా

కరీంనగర్ క్రైం, జూలై 23, (ప్రజాజ్యోతి): కరీంనగర్ జిల్లాలో సంచలనం రేపిన గుండ్లపల్లి మాజీ సర్పంచ్ భర్త బేతెల్లి రాజేందర్ రెడ్డి ఆత్మహత్యాయత్నం కేసు విషాదాంతమైంది.ఈ నెల 14న మానకొండూర్ ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ క్యాంపు కార్యాలయం ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాజేందర్ రెడ్డి 10 రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మరణంతో గుండ్లపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా కరీంనగర్ నగరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.రాజేందర్ రెడ్డి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో కుటుంబ సభ్యులు,బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.అనంతరం మానకొండూర్ ఎమ్మెల్యే పీఏ మురళీధర్ రెడ్డి ఇంటి ముందు కూడా ధర్నా నిర్వహిస్తూ ఆయనను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.దీంతో పోలీసులు భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

10 రోజుల క్రితం జరిగిన వివాదమే కారణమా?..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 10





రోజుల క్రితం రాజేందర్ రెడ్డికి మరో వ్యక్తితో రెండు వేర్వేరు అంశాలపై వివాదం చోటుచేసుకుంది, ఒకటి ఎస్సీ, ఎస్టీ చట్టానికి సంబంధించిన అంశం కాగా, మరొకటి భూమిలో అక్రమంగా ప్రవేశించి అక్కడ కూర్చోవడంపై జరిగిన గొడవగా పోలీసులు పేర్కొన్నారు.ఈ ఘటనలకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసి విచారణ కొనసాగుతున్న సమయంలోనే రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు.అక్కడే ఉన్న స్థానికులు వెంటనే స్పందించి రాజేందర్ రెడ్డిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినప్పటికీ,తీవ్ర గాయాల కారణంగా శరీరంలోని అంతర్గత అవయవాలు దెబ్బతినడంతో ఆయన బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు...

రాజేందర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.కేసు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని,విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాజేందర్ రెడ్డి మృతితో గుండ్లపల్లి గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా,పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉండటంతో గ్రామంతో పాటు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి, ఎమ్మెల్యే పీఏ నివాసం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ ఘటన జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

# ముస్తాబాద్‌లో ఘనంగా కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలు

ముస్తాబాద్, జూలై 23 ( ప్రజా జ్యోతి ): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను ముందస్తుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మెంగని మనోహర్, బీఆర్ఎస్ పార్టీ యువజన మండల అధ్యక్షుడు శీలం స్వామి ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గ శాసనసభ్యుడిగా ప్రజలకు సేవలందిస్తున్న కేటీఆర్ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని అన్నారు. అనంతరం స్వరాష్ట్రంలో మున్సిపల్ శాఖ, ఐటీ శాఖ మంత్రిగా పనిచేస్తూ రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేశారని, ముఖ్యంగా ఐటీ రంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేసి తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. కేటీఆర్‌కు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగుతూ భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా సేవ చేసే అవకాశం రావాలని ఆకాంక్షించారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ దేశాభివృద్ధికి తన వంతు సేవలు అందించాలని కోరారు. అలాగే కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసి కేసీఆర్‌ను మూడోసారి



ముఖ్యమంత్రిగా చేయడమే పార్టీ శ్రేణుల లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, యువజన పట్టణ అధ్యక్షుడు మిడిదొడ్డి యాదగిరి, ఎండి. జహంగీర్, శీలం వెంకటేష్, మోతె రవి, పోతారం సతీష్, చందనం ఆంజనేయులు, పడిగె ఆంజనేయులు, భనుక నాగరాజు, కోడె శ్రీనివాస్, వంగూరి దిలీప్, మనీష్, సుంచు నర్సింలు, కొమ్మేటి రాజమల్లు, గంగారి అజయ్, ఇర్రి శ్రీవాస్తవ్, సిరిసిల్ల పవన్, స్వామి, కరెడ్ల మల్లారెడ్డి, కట్ట దేవరాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపూర్ లో ఎల్‌నినో ప్రభావ నివారణ చర్యలపై అవగాహన సమావేశం

గంభీరావుపేట జూలై 23 (ప్రజా జ్యోతి); రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్ గ్రామంలో గురువారం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే చర్యలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, పంటల వైవిధ్యీకరణపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి, మండల తహసీల్దార్ మారుతిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి సలావుద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగంలో పొదుపు పాటించాలని సూచించారు. బోర్‌వెల్‌లలో భూగర్భ జలాలను పెంపొందించేందుకు బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేయడం వల్ల నీటి లభ్యత మెరుగుపడుతుందని వివరించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయ సాగు పద్ధతులు, మట్టి తేమ సంరక్షణ చర్యలు, నీటి సమర్థ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులు ప్రభుత్వ శాఖల సూచనలను పాటిస్తూ, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సాగు నిర్వహిస్తే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని అధికారులు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.




## బొప్పాపూర్ లో హరితహారం

ఎల్లారెడ్డిపేట జూలై 23 (ప్రజా జ్యోతి ) ఎల్లారెడ్డిపేట మండల లోని రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో గురువారం రోజున హరితహారం లో భాగంగా శ్రీ వెంకటేశ్వరగుట్ట



దగ్గర మొక్కలు నాటిన గ్రామ సర్పంచ్ ఇల్లెందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి ఉప సర్పంచ్ వెంకటరెడ్డి మరియు వార్డ్ మెంబర్స్ చంద్రారెడ్డి, పద్మారెడ్డి, రజిత, దేవవ్వ ,మంగ మరియు గ్రామపంచాయతీ కార్యదర్శులు సంతోష్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసుల విధులకు ఆటంకం ముగ్గురిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూలై 23, (ప్రజాజ్యోతి): విధుల్లో ఉన్న పోలీసులకు అడ్డుతగిలి విధి నిర్వహణకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులను కరీంనగర్ రూరల్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి బైండోవర్ చేశారు.రూరల్ ఇన్స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి కథనం ప్రకారం..ఈ




నెల 19వ తేదీ రాత్రి బొమ్మకల్ గ్రామంలో గస్తీ నిర్వహిస్తున్న ఏఎస్ఐ జయశంకర్,ఆయన సిబ్బంది బహిరంగంగా మద్యం సేవిస్తూ అల్లరి చేస్తున్న కొందరిని గుర్తించారు.వారిపై చర్యలు తీసుకునేందుకు ఫోటోలు తీస్తుండగా వారు పోలీసులకు అడ్డుతగిలి అక్కడి నుంచి పరారయ్యారు.ఈ ఘటనపై బొమ్మకల్‌కు చెందిన కాల్వా సాయి ప్రణయ్,మేకల రాజుకుమార్,మేకల రఘులపై కేసు నమోదు చేసిన పోలీసులు అనంతరం వారిని అదుపులోకి తీసుకుని విచారించారు.తప్పును అంగీకరించడంతో నోటీసులు జారీ చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.విధుల్లో ఉన్న పోలీసులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

## కేటీఆర్ జన్మదిన సందర్భంగా పొలంలో శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకుడు

### కొమ్మటి అంజలి రాజమల్లు

ముస్తాబాద్, జూలై 23 ( ప్రజా జ్యోతి ): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొమ్మటి అంజలి రాజమల్లు తన అభిమాన





నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని తన వ్యవసాయ పొలంలో "కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు" అని వరి నాట్లతో రాయించి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేటీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. అలాగే కేటీఆర్ భవిష్యత్తులో తెలంగాణ ముఖ్యమంత్రి కావాలని, దేశంలో అత్యున్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రతి సంవత్సరం తన అభిమాన నాయకులు కేసీఆర్, కేటీఆర్ పేర్లను తన వ్యవసాయ పొలంలో రాసి వరి సాగును ప్రారంభించడం తన ఆనవాయితీ అని తెలిపారు. వ్యవసాయం ద్వారా తన నాయకులపై ఉన్న అభిమానాన్ని వ్యక్తం చేస్తూ వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తుంటానన్నారు.

## వివేకానంద విద్యానికేతన్ విద్యార్థులకు ఆల్ ఇండియా ర్యాంకులు:-

కరీంనగర్ టౌన్ జూలై 23 (ప్రజా జ్యోతి ) స్థానిక భగత్ నగర్ వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థల విద్యార్థులు ఎడోస్ ఐఐటి వారు నిర్వహించిన పరీక్షల్లో కూకట్ల సహస్ర(10 వర్యాంకు), టి. భవిష్య(19వర్యాంకు) లతో అత్యుత్తమ



ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య మాట్లాడుతూ గడిచిన రెండు సంవత్సరాల నుంచి జిల్లాలో ప్రప్రధమంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధనను ఏడోస్ ఐఐటి కరికులంతో అందిస్తున్నామన్నారు.విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ బయాలజీ సబ్జెక్టులలో చక్కని సామర్థ్యంతో ముందుకు వెళుతున్నారని, భవిష్యత్తులో ప్రతిష్టఐఐటీలో మెడికల్ లో సీట్లు సాధించేందుకు మా కరికులం బలమైన పునాదిని అందిస్తుందని,అలాగే ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ సన్మానించి, శుభాభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ,వైస్ ప్రిన్సిపాల్,ఏ వో ,ఐఐటి అధ్యాపక బృందం పాల్గొన్నారు

### గ్రామాల అభివృద్ధి పనులు

# పారదర్శకతతో నిర్వహించండి

● సమగ్రాభివృద్ధి ప్రణాళికా పైలట్ ప్రాజెక్ట్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ, డీపీవో అనూష

● పైలట్ ప్రాజెక్ట్ గ్రామంగా మల్లారం

**పినపాక, జూలై 23 (ప్రజాజ్యోతి)** మండలంలోని మల్లారం, ఏడూళ్ల బయ్యారం గ్రామపంచాయతీలను రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ప్రణాళిక పైలట్ ప్రాజెక్ట్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ డి పి ఓ అనూష గురువారం పరిశీలించారు. సమగ్ర అభివృద్ధి ప్రణాళిక పైలట్ ప్రాజెక్ట్ లో భాగంగా జిల్లాలో మూడు గ్రామ పంచాయతీలను ఎంపిక అయ్యాయని, అందులో పినపాక మండలం మల్లారం గ్రామం ఎంపికైందని వారు వివరాలు వెల్లడించారు. గ్రామ సమగ్ర అభివృద్ధికి సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్ లో నమోదు చేయబడతాయన్నారు. పోర్టల్ లో క్షేత్ర స్థాయిలో తలెత్తే సాంకేతిక సమస్యలను పరిశీలన చేసినట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ లో ఎంపికైన గ్రామాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక నిధులు మంజూరు చేయబడతాయన్నారు. అనంతరం ఏడూళ్ల బయ్యారం లో పర్యటించారు. గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, పచ్చదనం, గ్రామాభివృద్ధి పనులు, పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సర్పంచి చంద్రావు, సెక్రటరీ సంధ్యకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ సుధీర్ కుమార్, ఎంపీడీవో సంకీర్త్, ఎంపీ ఓ శ్రీనివాస్, సెక్రటరీలు ఖాజా హుస్సేన్, తరుణ్, ఉప సర్పంచ్ గంగిరెడ్డి సందీప్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# కొత్త మెడికల్ సూపరింటెండెంట్ల నియామకం

● వైద్య విధాన పరిషత్‌లో సీనియారిటీ ప్రాతిపదికన ముగ్గురు రెగ్యులర్ వైద్యులకు బాధ్యతలు






**ఇల్లెందు, జూలై 23 (ప్రజాజ్యోతి)** తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆసుపత్రులకు కొత్త మెడికల్ సూపరింటెండెంట్లను నియమిస్తూ గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రుల పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఇటీవల నిర్వహించిన వైద్యుల రీ-డిప్లాయ్‌మెంట్ అనంతరం పాల్వంచ, ఇల్లెందు, బూర్గంపాడు ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ రెగ్యులర్ వైద్యులను సీనియారిటీ ప్రాతిపదికన మెడికల్ సూపరింటెండెంట్లుగా నియమించారు. పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ గా సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (పీడియాట్రిక్స్) డా. ఎం. ముక్కంటేశ్వరరావు, ఇల్లందు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ గా సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (ఆర్థోపెడిక్స్) డా. కె చంద్రశేఖర్, బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ గా సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (అనస్థీషియా) డా. జి. ప్రసాద్ లను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డా. జి రవి బాబు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన రెగ్యులర్ వైద్యులకు పరిపాలనా బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆసుపత్రుల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. నూతనంగా నియమితులైన మెడికల్ సూపరింటెండెంట్లకు అభినందనలు తెలియజేస్తూ, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

**ఇల్లందు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌గా చంద్రశేఖర్**

ఇల్లందు ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌గా సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (ఆర్థోపెడిక్స్) డాక్టర్ కె చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ వైద్యశాలలో 16 ఏళ్లు విధులు నిర్వహించి ఖమ్మం ప్రధాన ఆసుపత్రికి బదిలీపై వెళ్లారు. ఖమ్మం ప్రధాన ఆసుపత్రిలో 2 ఏళ్ళు విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇల్లందు ఏరియా వైద్యశాలకు రావడం జరిగింది. దీంతో వైద్యశాలలో వైద్యులు డాక్టర్ వరుణ్ కుమార్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ రామ్ నివాస్, డాక్టర్ భగత్ సింగ్, వైద్య సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించి పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ డాక్టర్ కె చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో పూర్తి పూర్తిస్థాయి నాణ్యమైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యశాలలలో చికిత్స పొందాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాలపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా నిరంతరం కృషి చేస్తానని, తోటి వైద్యులు, సిబ్బంది సహకారంతో ముందుకు వెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు.

# చేయి నొప్పి రోగులకు వైద్యం



**ఇల్లందు, జులై 23 (ప్రజాజ్యోతి)** చేయి నొప్పితో ఇల్లందు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన ఇరువురికి ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కె చంద్రశేఖర్, డాక్టర్ వరుణ్ కుమార్ లు కలిసి మెరుగైన వైద్యం చేశారు. చేతి నొప్పితో వచ్చిన రోగులకు ఎక్స్రే తీసి పిఓపి కట్టు వేయడం జరిగిందని వైద్యులు తెలిపారు. దీంతో రోగులు సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో మరిన్ని మెరుగైన సౌకర్యాలతో వైద్య సేవలు అందిస్తామని వైద్యులు పేర్కొన్నారు.

### యువతను ఉత్తమ పౌరులుగా

# తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ పాత్ర కీలకం

● జిల్లా కలెక్టర్ అంకిత్

● జిల్లాలోని 25 ఎన్‌సీసీ యూనిట్లకు రూ.9 లక్షల విలువైన శిక్షణ సామగ్రి పంపిణీ





**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 23,(ప్రజా జ్యోతి)** యువతలో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించి వారిని బాధ్యతా యుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా జిల్లాలోని 25 ఎన్‌సీసీ యూనిట్లకు రూ.9 లక్షల విలువైన శిక్షణ సామగ్రిని అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ ఎన్‌సీసీ యూనిట్లకు శిక్షణ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్‌సీసీ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమయపాలన, నాయకత్వ నైపుణ్యాలు, జాతీయ సమైక్యత భావన, సేవా దృక్పథం వంటి విలువలను పెంపొందిస్తుందని అన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, శారీరక దృఢత్వం, సామాజిక బాధ్యత, దేశసేవ పట్ల అంకితభావాన్ని పెంపొందించడంలో ఎన్‌సీసీ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఎన్‌సీసీ ద్వారా తీర్చిదిద్దబడిన యువత భవిష్యత్తులో వివిధ రంగాల్లో రాణించడంతో పాటు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులు, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు ఎల్లప్పుడూ ముందుండి సేవలందించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు . జట్టు భావన, క్రమశిక్షణ, సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడానికి ఎన్‌సీసీ అత్యుత్తమ వేదికగా నిలుస్తోందన్నారు, ప్రభుత్వ కార్యక్రమాలకు కార్పొరేట్ సంస్థలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా సహకరించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ఈ శిక్షణ సామగ్రి ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి శిక్షణా శిబిరాలు, రిపబ్లిక్ డే క్యాంపులు, ఇతర పోటీల్లో వారు మరింత ప్రతిభ కనబర్చేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని 25 ఎన్‌సీసీ యూనిట్లకు 190 డమ్మీ గన్స్, 130 కంపాస్‌లు, 130 సర్వీస్ ప్రొట్రాక్టర్లు, 190 ఎన్‌సీసీ హ్యాండ్‌బుక్స్, 100 పోటీ పరీక్షల పుస్తకాలను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి పరంధామరెడ్డి, 11 తెలంగాణ బెటాలియన్‌కు చెందిన ఎన్‌సీసీ అధికారులు, జిల్లాలోని 25 ఎన్‌సీసీ యూనిట్ల అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు (ఏఎన్ఓలు), 120 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 7 డిగ్రీ కళాశాలలు, 18 పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సియంఓ ఆదేశాలు భేఖాతర్?

● నూతన ల్యాబ్ టెక్నీషియన్ పట్ల వివక్షత!

● ఐడి ఇవ్వకుండా కాలయాపన?

● లాంగ్ స్టాండింగ్ సిబ్బందే వైద్యశాలలో పెత్తనమా?

● లాంగ్ స్టాండింగ్ సిబ్బందికి బదిలీలు ఉండవా?

● గతంలో పని చేసిన వారికే అనుకూలంగా వ్యవహరిస్తున్నారా?

● పాత ల్యాబ్ టెక్నీషియన్ సమయంలో అనేక ఇబ్బందులు!

● తప్పుడు రిపోర్ట్ లు ఇచ్చారనే ఆరోపణలు

● నూతన ల్యాబ్ టెక్నీషియన్ పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్న వైనం!

● ఇదెక్కడి తీరని కార్మికులు సూటి ప్రశ్న

● వెంటనే ఐడి ఇవ్వాలని డిమాండ్ - సియంఓ గారూ జర స్పందించరూ!

**ఇల్లందు, జులై 23 (ప్రజా జ్యోతి)** స్థానిక సింగరేణి వైద్యశాలలో నూతనంగా విధుల్లో చేరిన ల్యాబ్ టెక్నీషియన్‌కు ఇప్పటివరకు ఐడీ జారీ కాకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. సింగరేణి సంస్థ సీఎంఓ ఆదేశాలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆసుపత్రి పరిపాలన తీరుపై ఉద్యోగులు, కార్మికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతుంది. అంతేకాకుండా గత కొన్ని ఏళ్ళుగా ఇల్లందు సింగరేణి వైద్యశాలలో లాంగ్ స్టాండింగ్ లో ఉంటూ వెదురు నిర్వహిస్తున్న సిబ్బంది పెత్తనం రోజురోజుకు పెరుగుతుందనే ఆరోపణలు లేకపోలేదు. కావాలనే నూతన ల్యాబ్ టెక్నీషియన్ కు ఐడి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, గతంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసిన వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నారు.

**నూతన టెక్నీషియన్‌పై వివక్షతేనా..?**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా వైద్యశాలలో నూతన ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న వారు నిబంధనలకు అనుగుణంగా ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తూ రోగులకు ఖచ్చితమైన ఫలితాలు అందించేందుకు కృషి చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఐడీ ఇవ్వకుండా విధుల నిర్వహణలో ఆటంకాలు కల్పించడం వెనుక కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇది పరిపాలనా నిర్లక్ష్యమా లేక ఉద్దేశపూర్వక వివక్షా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**లాంగ్ స్టాండింగ్ సిబ్బందిదే పెత్తనమా..?**

ఇల్లందు ఏరియా సింగరేణి ఆసుపత్రిలో ఏళ్ల తరబడి ఒకేచోట కొనసాగుతున్న కొంతమంది సిబ్బందే పరిపాలనను ప్రభావితం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా వచ్చిన ఉద్యోగులకు సహకరించకుండా, గతంలో పనిచేసిన వారికే అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సింగరేణి సంస్థ నిబంధనల ప్రకారం బదిలీలు అమలు కావాల్సి ఉండగా, కొంతమంది మాత్రం సంవత్సరాలుగా అదే స్థానంలో కొనసాగుతుండడం వెనుక కారణాలేమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

**గతంలో ఎదురైన ఇబ్బందులు..**

గతంలో పనిచేసిన ల్యాబ్ టెక్నీషియన్ హయాంలో పరీక్షల నివేదికలపై అనేక ఫిర్యాదులు వచ్చాయని, తప్పుడు రిపోర్టులు ఇచ్చారనే ఆరోపణలు కూడా వినిపించాయని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. అలాంటి ఆరోపణలు ఉన్నప్పటికీ అప్పటి సిబ్బందికే ప్రాధాన్యం ఇస్తూ, ప్రస్తుతం విధుల్లో ఉన్న ల్యాబ్ టెక్నీషియన్‌కు సహకరించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని అంటున్నారు. ఇలా వ్యవహరించడం ఏమిటని పలువురు సూటిగా ప్రశ్నిస్తున్నారు.






**పకడ్బందీగా పరీక్షలు... అయినా గుర్తింపు లేదు**

నూతన ల్యాబ్ టెక్నీషియన్ అన్ని పరీక్షలను నిబంధనల ప్రకారం నిర్వహిస్తూ రోగుల విశ్వాసాన్ని పొందుతున్నారని ఆసుపత్రికి వచ్చే పలువురు కార్మికులు, కార్మిక కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయినప్పటికీ ఐడి ఇవ్వకపోవడం వల్ల పరిపాలనా ప్రక్రియల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమాచారం.

**కార్మికుల ప్రశ్న**

సీఎంఓ ఆదేశాలు ఉన్నా అమలు ఎందుకు కావడం లేదు..? లాంగ్ స్టాండింగ్ సిబ్బందే ఆసుపత్రిని నడుపుతున్నారా..? కొత్తగా వచ్చిన ఉద్యోగికి ఐడీ ఇవ్వడంలో జాప్యం ఎందుకు..? అంటూ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. వివక్షకు తావులేకుండా వెంటనే ఐడీ జారీ చేసి, అందరికీ సమాన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**సీఎంఓ గారూ... జర స్పందించరూ..!**

ఈ వ్యవహారంపై ప్రధాన వైద్యాధికారి వెంటనే స్పందించి, ఐడీ జారీ ఆలస్యానికి గల కారణాలను వెల్లడించాలని, నూతన ల్యాబ్ టెక్నీషియన్‌కు తక్షణమే ఐడి ఇచ్చేలా చొరవ చూపాలని, ఐడి జాప్యానికి కారకులో ఎవరో విచారణ నిర్వహించి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పరిపాలనలో పారదర్శకత తీసుకురావాలని ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారు.

**సక్రమంగా మెడికల్ టెస్టుల రిపోర్ట్ లు ఇవ్వాలి: డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్, సియంఓ, కొత్తగూడెం, సింగరేణి సంస్థ**

సింగరేణి కార్మికులు, కార్మిక కుటుంబాలకు సక్రమంగా మెడికల్ టెస్టుల రిపోర్టులు ఇవ్వాలి. టెస్టుల రిపోర్టులలో తప్పులు రాకుండా జాగ్రత్త వహించాలి. కార్మికులు, కార్మిక కుటుంబాలకు మరింత నమ్మకమైన వైద్య సేవలు అందించాలి. సింగరేణి సంస్థ పరిధిలోని వైద్యశాలల్లో లాంగ్ స్టాండింగ్ సిబ్బంది బదిలీ విషయమై సింగరేణి డైరెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుంది. వారి సూచనలు మేరకు నిర్ణయం తీసుకుంటాం.

### శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను

# తరగతిలో అమలు చేయాలి

● డిఈఓ వాసంతి






**పినపాక, జూలై 23 (ప్రజాజ్యోతి)** ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల నుంచి మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) డి. వాసంతి సూచించారు. గురువారం పినపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఇన్-సర్వీస్ ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ట్రైనింగ్ శిబిరాన్ని ఆమె సందర్శించారు. శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులను వివిధ అంశాలపై ప్రశ్నించి, వారు నేర్చుకున్న విషయాలను తెలుసుకున్నారు. శిక్షణ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఈ శిక్షణ ద్వారా తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని వాటిని తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా కొత్త విషయాలను నేర్చుకుంటూ ఉంటేనే విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో బలమైన పునాది ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో కనీసం 80 శాతం కంటే తక్కువ కాకుండా ప్రతిభ కనబరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి టి. మాధవరావు, రిసోర్స్ పర్సన్స్ రాజేశ్వరరావు, కృష్ణయ్య, బాబురావు, షాలిని, సీఆర్పీలు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుపై కాంగ్రెస్ రాస్తారోకో



**చర్ల, జూలై 23 :(ప్రజాజ్యోతి):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో రాస్తారోకోతో పాటు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విజయ్ నాయుడు మాట్లాడుతూ జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల శాంతియుత నిరసనకు మద్దతు తెలిపిన రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి రాజ్యాంగ విలువలకు విరుద్ధమని ఆరోపించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ప్రతిపక్ష నాయకుడిని లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు తగవని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకుని ఆయనను బేషరతుగా విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందుల బుచ్చిబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుందర్ సురేష్, సీనియర్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి, లంక రాజు, డాక్టర్ రంగారావు, మైప జోగారావు, మాజీ ఎంపీటీసీ మడకం పద్మజ, మేడబత్తిని వాసు, తాండవ రాయుడు, గూడపాటి రంజిత్ కుమార్, మాజీ ఎంపీటీసీ కుంజా నాగేశ్వరరావు, మేడబత్తిన మనోహర్, నూప కృష్ణ, ఇరప వేణు, శ్రీదేవి, శిరీషతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### కరకవాగులో భూ రీ-సర్వే

# పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,జూలై 23,(ప్రజా జ్యోతి)** పాల్వంచ మండలం కరకవాగు గ్రామంలోని సర్వే నెం.727లో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ఈ సందర్భంగా భూ రీ-సర్వే పనుల పురోగతి, చేపడుతున్న విధానం, భూముల హద్దుల నిర్ధారణ ప్రక్రియపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ ప్రస్తుతం ప్రతిరోజూ 42 నుండి 50 ఎకరాల వరకు భూములకు రీ-సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 580 ఎకరాల భూములకు రీ-సర్వే పూర్తి చేసినట్లు వివరించారు, అదేవిధంగా సుమారు 705 ఎకరాల భూములకు రీ-సర్వే చేపట్టాల్సి ఉందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భూ రీ-సర్వే కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి భూమి హద్దును సంబంధిత రైతుల సమక్షంలోనే గుర్తించి, ఎలాంటి వివాదాలకు తావులేకుండా సర్వే నిర్వహించాలని తెలిపారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. భూ రీ-సర్వే కార్యక్రమం రైతుల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం చేపట్టిందని పేర్కొంటూ, అధికారులు నిర్వహించే సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర సంబంధిత ఆధారాలను అధికారులకు అందించాలని సూచించారు. భూముల హద్దులను నిర్ధారించే సమయంలో రైతులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు. భూ రీ-సర్వే పూర్తయితే భూముల హద్దులపై స్పష్టత ఏర్పడి, భూ వివాదాలు తగ్గడంతో పాటు భూ రికార్డులు మరింత పారదర్శకంగా మారుతాయని జిల్లా కలెక్టర్ అన్నారు . ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకొని అధికారులకు సహకరించాలని కోరారు, ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాల్వంచ తాసిల్దార్ ధారా ప్రసాద్, సర్వేయర్లు, రైతులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వైద్య రంగంలో కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన

## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం గైడ్ లైన్స్ అమలులో హోమియోపతి వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రికి జేఏసీ వినతి

హైదరాబాద్, జూలై 23:
హోమియోపతి వైద్యులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ నిబంధనలు, అగ్నిమాపక సిబ్బంది రక్షణ ధృవీకకణ మరియు డాక్టర్ల క్లీనిక్ ఉండవలసిన నిర్ణీత వైశాల్యం ఇతర పరిపాలనా అంశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను జాయింట్ యాక్షన్ కమిటీ (JACH) ప్రతినిధి బృందం గౌరవనీయులైన ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనరసింహ గారి దృష్టికి తీసుకువె



ళ్లింది. tజేఏసీ ప్రతినిధులు ముఖ్యంగా హోమియోపతి విధాన క్లినిక్‌ల ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలులో తగిన సవరణలు, సరళీకరణ మరియు ఉపశమనం కల్పించాలని మంత్రివర్యులను కోరారు. అలాగే బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ నిబంధనల అమలులో చిన్న క్లినిక్‌లు ఎదుర్కొంటున్న ఆచరణాత్మక ఇబ్బందులను కూడా వివరించారు.
మంత్రి గారు అన్ని అంశాలను ఎంతో ఓర్పుతో ఆలకించి సానుకూలంగా స్పందించారు. సమస్యలను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ (ఆరోగ్య శాఖ) గారికి ఆదేశాలు జారీ చేశారు.
మంత్రి గారి ఆదేశాల మేరకు జేఏసీ తరఫున అన్ని సమస్యలను వివరంగా పొందుపరిచిన వినతిపత్రాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయానికి సమర్పించారు. సమస్యల పరిష్కారం జరిగే వరకు ప్రభుత్వంతో నిరంతర సంప్రదింపులు కొనసాగించనున్నట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.
ఈ సమావేశం ప్రశాంతంగా, హుందాగా మరియు నిర్మాణాత్మక వాతావరణంలో జరిగింది. జేఏసీ సభ్యుల ఐకమత్యం, క్రమశిక్షణ మరియు సహకారానికి కన్వీనర్ డా. మధు వారణాసి మరియు కో కన్వీనర్లు కృతజ్ఞతలు తెలిపారు.జాయింట్ యాక్షన్ కమిటీ డా. మధు వారణాసి – కన్వీనర్ డా. దుర్గాప్రసాద్ – కో–కన్వీనర్ డా. నరోన్ – కో–కన్వీనర్ డా. రమేష్ గౌడ్ – కో–కన్వీనర్ డా. శైలేందర్ – కో–కన్వీనర్ డా. వేణుగోపాల గౌరి – కో–కన్వీనర్ డా. ఎలియా రెడ్డి – కో–కన్వీనర్ డా.ఆరాధ్య కో – కన్వీనర్ డా.రాజేశ్వర్ రావు కో– కన్వీనర్ డా.గౌతం జారీ చేసారు.

## కేటీఆర్ పర్యటనలో మీడియాపై వివక్ష

### కొద్దిమందికే సమాచారం.. జర్నలిస్టుల్లో అసంతృప్తి

హనుమకొండ జిల్లా ప్రతినిధి, జూలై 23,(ప్రజా జ్యోతి):
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్ పర్యటన సందర్భంగా మీడియా నిర్వహణపై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ కార్యక్రమాలు, చిట్‌చాట్ సమావేశాల



సమాచారాన్ని కేవలం కొందరు జర్నలిస్టులకు మాత్రమే అందించడం, మిగిలిన వారిని పక్కన పెట్టడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక పార్టీ నాయకత్వం అనుసరించిన తీరుపై జర్నలిస్టులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలను కొద్దిమందికే పరిమితం చేయడం వల్ల "కేటీఆర్ కేవలం కొందరి నాయకుడేనా? లేక బీఆర్ఎస్‌కు ఎంపిక చేసిన జర్నలిస్టులే అవసరమా?" అనే ప్రశ్నలు రాజకీయ, మీడియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గ్రేటర్ వరంగల్ మీడియా వర్గాల్లో కొందరు కావాలనే పెద్ద, మధ్య, చిన్న పత్రికల పేరుతో వర్గీకరణకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న పలువురు జర్నలిస్టులను విస్మరించి, కొందరికే ప్రాధాన్యం కల్పించడం సరైన విధానం కాదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాయకుల చుట్టూ ఉన్న కొందరి సూచనల మేరకే పీఆర్వోలు, పార్టీ బాధ్యులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. చిట్‌చాట్‌ల వంటి కార్యక్రమాలను బహిరంగంగా నిర్వహించకుండా పరిమిత వర్గానికే అవకాశం కల్పించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పలువురు పేర్కొంటున్నారు.
క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టులను విస్మరించి, కొద్దిమందికే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పార్టీకి మైలేజ్ కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుందని మీడియా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.అందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన నాయకులు మీడియాను వర్గాలుగా విభజించే ధోరణిని విడనాడాలని జర్నలిస్టు వర్గాలు సూచిస్తున్నాయి. కేటీఆర్ పర్యటన సమాచారాన్ని పరిమిత వర్గానికే అందించడం, చిట్‌చాట్‌లను గోప్యంగా నిర్వహించడం వంటి చర్యలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా పార్టీ నాయకత్వం మీడియా పట్ల సమాన వైఖరిని అవలంబించాలని కోరుతున్నారు.

## డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి..

చేసుకున్నారు. 'ఏదైనా తప్పు చేసి ఉంటే నేను మాత్రమే చేశాను. నా భార్య, పిల్లలు ఏ తప్పు చేయలేదు. నా భార్య, పిల్లల్ని ఏమీ అనొద్దు. వాళ్లు



మంచివాళ్లు. నేను చనిపోయిన తర్వాత ఎవరైనా నా భార్యను పిల్లల్ని వేధించినా, హింసించినా దెయ్యమై వదిలిపెట్టను. ఎందుకంటే వాళ్లు అంటే నాకు చాలా ఇష్టం. అమ్మని, అక్కని జాగ్రత్తగా చూసుకో' అంటూ కొడుకుకు సూచిస్తూ డైరీలో స్వామి సూసైడ్ నోట్ రాశారు. కానిస్టేబుల్ బలవన్మరణంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్వామి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కానిస్టేబుల్ మృతదేహాన్ని డీజీపీ కార్యాలయం నుంచి ఉస్మానియా మార్చురీకి తరలించారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ అధికారులు అక్కడకు చేరుకుని ఆధారాలను సేకరించే పనిలో ఉన్నారు. కానిస్టేబుల్ స్వామి రాసిన సూసైడ్ నోట్‌పై అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే స్వామి సూసైడ్‌కు బెట్టింగ్ కారణమని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే స్వామి కుటుంబసభ్యులు డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కానిస్టేబుల్ మృతితో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# కుమ్మరి చక్రం ఆగితే.. సంస్కృతి చరిత్రే ఆగినట్లే!



**మట్టిపాత్రలతో ఆరోగ్యం.. కనుమరుగవుతున్న కుమ్మరి సంప్రదాయం!"**
**బోనం పూజలు మట్టికుండలతోనే... కుమ్మరి బతుకు మాత్రం మట్టిలోనే!**
**పుట్టుక నుంచి చితివరకు మనిషి జీవితానికి మట్టి ముద్ర.. మనుగడ కోసం కుమ్మరిపోరాటం**
**బ్రతుకుభారంగా మారిన కుమ్మరుల కులవృత్తి.. ఆదరణ లేక కనుమరుగవుతున్న కుమ్మరి చక్రం**

వనపర్తి ప్రతినిధి, జూలై 18 (ప్రజాజ్యోతి):
తెలంగాణ సంస్కృతికి, భారతీయ నాగరికతకు ప్రతీకగా నిలిచిన మట్టికుండలు నేడు కనుమరుగవుతున్నాయి. నాటి కాలంలో ప్రతి ఇంట్లో, ప్రతి పండుగలో, ప్రతి శుభకార్యంలో తప్పనిసరిగా కనిపించే మట్టిపాత్రలు, ప్రతిమలు, దీపం చెమ్మలు



ఇప్పుడు ప్లాస్టిక్, స్టీల్, అల్యూమినియం వస్తువుల మధ్య తమ ఉనికిని కోల్పోతున్నాయి. ఒకప్పుడు ప్రతి ఇంటిలో తప్పనిసరిగా కనిపించే మట్టి కుండలు నేడు ప్లాస్టిక్, ఫ్రిజ్‌ల వినియోగంతో క్రమంగా కనుమరుగవుతున్నాయి. మట్టి కుండలు తయారు చేయడం అనేది ఒక సంప్రదాయ కళ సాధారణంగా కుమ్మరులు నదీ తీరాలు, చెరువులు, కుంటలు లేదా ప్రత్యేక ప్రాంతాల నుంచి నాణ్యమైన జిగురు మట్టిని సేకరిస్తారు. మట్టిలోని రాళ్లు, గడ్డి, చెత్తను తొలగించి మట్టిని శుద్ధి చేసి నీటితో కలిపి బాగా నానబెడతారు. నానిన మట్టిని కాళ్లతో లేదా చేతులతో బాగా తొక్కి మెత్తగా చేసి గాలి బుడగలు లేకుండా ముద్దగా తయారు చేస్తారు. కుమ్మరి చక్రాన్ని తిప్పుతూ మట్టి ముద్దను ఉంచి చేతులతో కుండ, గిన్నె, కూజా వంటి పలు రకాల పాత్రల ఆకారాలను తయారు చేసి నీడలో, తరువాత ఎండలో పూర్తిగా అరబెడతారు. ఆరిన కుండలను ప్రత్యేక బట్టీలో (భట్టీ) కట్టెలు, పొట్టు లేదా ఇతర ఇంధనంతో అధిక ఉష్ణోగ్రత వద్ద కాలుస్తారు. దీంతో అవి గట్టిగా, మన్నికగా మారుతాయి. అనంతరం వాటికి అవసరమైతే రంగులు, అలంకరణలు చేసి విక్రయానికి సిద్ధం చేస్తారు. ఆధునిక పరిశోధనల ప్రకారం మట్టికుండల్లో నిల్వ చేసిన పదార్థాలు సహజసిద్ధంగా చల్లగా ఉండటంతో పాటు శరీరానికి అనుకూలమైన ఖనిజ గుణాలను కలిగి ఉంటుంది. మట్టిపాత్రల్లో వండిన ఆహారానికి ప్రత్యేక రుచితో పాటు ఆరోగ్య పరంగా మట్టి కుండల ప్రాధాన్యం ఇప్పటికీ ఏమాత్రం తగ్గలేదు. మట్టి కుండలో నిల్వ చేసిన నీరు సహజంగా చల్లగా ఉండటంతో పాటు శరీరానికి అనుకూలమైన ఉష్ణోగ్రతలో ఉంటుంది. ఫ్రిజ్‌లోని అతిచల్లని నీటితో పోలిస్తే మట్టి కుండ నీరు తాగడం వల్ల గొంతు, జీర్ణక్రియపై ఒత్తిడి తక్కువగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ప్లాస్టిక్ పాత్రల వినియోగాన్ని తగ్గించి మట్టి పాత్రలను ఉపయోగించడం పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుంది. సంప్రదాయాన్ని కాపాడుతూ ఆరోగ్యాన్ని సంరక్షించాలంటే మట్టి కుండల వినియోగాన్ని మళ్లీ పెంచాల్సిన అవసరం ఉంది. వాటితో పాటు వేల ఏళ్ల చరిత్ర కలిగిన కుమ్మరి కులవృత్తి కూడా మనుగడ కోసం పోరాడుతోంది. తెలంగాణలో బీసీ–బీ (8వ జాబితా)లో ఉన్న కుమ్మరి కులానికి ఒకప్పుడు ప్రభుత్వాల నుంచి లభించిన రుణాలు, సబ్సిడీలు ప్రస్తుతం అందకపోవడంతో సంప్రదాయ కులవృత్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మట్టి కుండలు, మట్టి విగ్రహాల తయారీనే జీవనాధారంగా కొనసాగిస్తున్న కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో వృత్తిని వదిలిపెట్టే పరిస్థితి నెలకొంది. వనపర్తి పట్టణంలో సుమారు 200కు పైగా కుమ్మరి జనాభా ఉండగా కొందరు మాత్రమే ఈ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తుండగా, జిల్లా వ్యాప్తంగా దాదాపు 20 నుంచి 25వేల మంది కుమ్మరి జనాభా ఉన్నట్లు సంఘం ప్రతినిధులు చెబుతున్నారు.

### తెలంగాణ సంస్కృతిలో కుమ్మరి పాత్ర అపూర్వం

తెలంగాణ సంస్కృతిలో మట్టి కుండలకు ప్రత్యేక స్థానం ఉంది. బోనాలు, పండుగలు, శుభకార్యాలు, నిత్యజీవితంలోనూ మట్టి పాత్రల వినియోగం ఆనవాయితీగా కొనసాగుతోంది. బోనాల పండుగలో భాగమైన కుమ్మర్ల పాత్ర మన పూర్వీకుల జీవన విధానాన్ని, కులవృత్తుల గొప్పతనాన్ని చెప్పటానికి నిదర్శనం. మట్టిపాత్ర అనేది కేవలం ఒక వస్తువు కాదు అది మన సంస్కృతి, సంప్రదాయం, పర్యావరణహితం, ఆరోగ్యానికి ప్రతీక. బోనాల పండుగ అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది రంగురంగుల మట్టికుండే. అమ్మవారికి సమర్పించే బోనం మట్టికుండలోనే వండాలి అనే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. అలాగే బతుకమ్మ పండుగ, గ్రామదేవతల జాతరలు, నాగుల చవితి, వినాయక చవితి వంటి అనేక పండుగల్లో మట్టిపాత్రలకే ప్రాధాన్యం ఉంది. మట్టికుండ లేకుండా బోనం



అసంపూర్ణమనే భావన భక్తుల్లో ఇప్పటికీ బలంగానే ఉంది.

### పుట్టుకకైనా... చావుకైనా మట్టికుండే ఆధారం

పుట్టుక నుంచి చితివరకు మనిషి జీవితంలో భాగమైన మట్టిపాత్రను కాపాడటం అంటే కుమ్మరి కుటుంబాల జీవనాన్ని కాపాడటమే. మనిషి జీవిత ప్రయాణంలో పుట్టుక నుంచి చావు వరకు మట్టికుండకు ప్రత్యేక స్థానం ఉంది. పుట్టిన శిశువుకు చేసే సంప్రదాయ కార్యక్రమాల నుంచి అంత్యక్రియల వరకు అనేక సందర్భాల్లో మట్టిపాత్రలే వినియోగిస్తారు. హిందూ సంప్రదాయంలో చివరి సంస్కారాల సమయంలో మట్టికుండను పగులగొట్టడం ఇప్పటికీ కొనసాగుతున్న ఆచారం. అయినప్పటికీ ఆ కుండను తయారు చేసిన కుమ్మరి జీవితం మాత్రం ఛిద్రమవుతోంది.

### "కనుమరుగవుతున్న కుమ్మరి సంప్రదాయం!"

ఒకప్పుడు ప్రతి ఇంట్లో కనిపించిన మట్టికుండలు నేడు అలంకరణ వస్తువులుగా మాత్రమే మిగిలిపోతున్నాయి. తెలంగాణ సంస్కృతికి ప్రాణం పోసిన కుమ్మరి కులవృత్తి నేడు మనుగడ కోసం పోరాడుతోంది. మట్టికుండకు ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆరోగ్యపరమైన విలువను సమాజం గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆరోగ్యకరమైన జీవనశైలికి మట్టిపాత్రల వినియోగాన్ని మళ్లీ ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు గ్రామాల్లో కుమ్మరి చక్రం నిరంతరం తిరిగేది. ఏడాది పొడవునా కుండలు, కుండీలు, గిన్నెలు, దీపాలు, పూజా సామగ్రి తయారయ్యేవి. ప్రస్తుతం ప్లాస్టిక్, స్టీల్, ఫైబర్ ఉత్పత్తులు మార్కెట్‌ను ఆక్రమించడంతో మట్టిపాత్రలకు డిమాండ్ తగ్గిపోయింది. మట్టి సేకరణకు అనుమతుల సమస్య, రవాణా ఖర్చులు, తయారీ వ్యయం పెరగడం వంటి కారణాలతో కుమ్మరి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం అనేక పథకాలు ప్రకటించినప్పటికీ, అవి పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయికి చేరడం లేదని కుమ్మరులు వాపోతున్నారు. ఆధునిక విద్యుత్ చక్రాలు, మట్టి శుద్ధి యంత్రాలు, మార్కెటింగ్ సదుపాయాలు, వడ్డీ లేని రుణాలు, శిక్షణ, ఆన్‌లైన్ విక్రయ వేదికలు కల్పిస్తే ఈ సంప్రదాయ వృత్తికి కొత్త ఊపిరి లభిస్తుందని వారు కోరుతున్నారు. ఈ వృత్తి అంతరించిపోతే ఒక కులవృత్తి మాత్రమే కాదు, వేల ఏళ్ల నాగరికతకు చెందిన ఓ జీవన విధానం కూడా కనుమరుగవుతుంది. పాఠశాలల నుంచి ప్రజల్లోకి మట్టిపాత్రల ప్రాముఖ్యతను తీసుకెళ్లే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. భావితరాలకు వారసత్వాన్ని అందించాలనీ పర్యావరణ పరిరక్షకులు కోరుతున్నారు. ప్రతి ఏడాది బోనాలు, బ్రతుకమ్మ, పండగల సమయంలో మాత్రమే కుమ్మరి కుటుంబాల వద్ద సందడి కనిపిస్తుంది. పండుగ ముగిసిన వెంటనే మళ్లీ వారి జీవితం కష్టాల్లోకి జారిపోతుంది. ఏడాదంతా ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది. ఈ సంప్రదాయ వృత్తిని ఆదుకుంటేనే భావితరాలకు ఈ వారసత్వం సజీవంగా అందుతుంది. ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టి రుణాలు, సబ్సిడీలు, ఆధునిక యంత్రాలు, మట్టి సేకరణకు సౌకర్యాలు కల్పిస్తే కులవృత్తి పునరుజ్జీవం పొందుతుందని వారు కోరుతున్నారు.

**మారుతున్న ఆధునిక ప్రపంచంలో కాలుష్యంతో కుట్టుమిట్టు ఆడుతున్న మనవాళ్ళకి కుమ్మరకుండా శ్రేష్టమని తెలియజేస్తూ కుమ్మరి వృత్తి ఒక జీవన విధానాన్ని పెంపొందించాలని కోరుకుంటూన్నారు. వనపర్తి నియోజకవర్గంలో దాదాపుగా వృత్తి నమ్ముకుని కుమ్మరులు జీవన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వాలు గుర్తించి మరల కుమ్మర్లకు ప్రత్యేక తోడ్పాటు కల్పించాలి.**



**బొడ్డుపల్లి పరశురాం, కుమ్మర సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు, వనపర్తి జిల్లా**

**కుమ్మర కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు, కులవృత్తి అభివృద్ధికి సబ్సిడీలు, మట్టి కుండలు, మట్టి విగ్రహాలు తయారీకి అవసరమైన యంత్రాలు, పనిముట్లు, వర్క్‌షెడ్లు వంటి పలు ప్రోత్సాహకాలు అందించాలి. అలాంటి పథకాలు లేకపోవడంతో వృత్తి కొనసాగించడం భారంగా మారింది. ప్రభుత్వం తరపున కుమ్మరి కులవృత్తికి ప్రాధాన్యత ఇస్తూ కుమ్మరులకు కుంటలను కేటాయించాలి. రాజకీయంగా కుమ్మరి సంఖ్యను గుర్తించి, రాజకీయంగా పదవులు కూడా ఇవ్వాలి. భావితరాలకు మట్టి కుండల విలువ, వాటితో ఉండే ఆరోగ్యం గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది.**



**సుగూరు రాము, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు, వనపర్తి జిల్లా**

## ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

మొదటిపేజీ తరువాయి..

పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్వేచ్ఛగా ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటికి సంబంధించి ప్రధాన సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే జూన్ వరకు వర్షాలు లేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. పశువులకు పశు గ్రాసం ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి కరవు పరిస్థితిలో ఆరుతడి పంటలు వేయాలని అన్నదాతలకు సూచిస్తున్నామని అన్నారు. గ్రౌండ్ వాటర్ రోజురోజుకూ పడిపోతోందని.. దీనిని పెంచేందుకు ప్రత్యేక యాక్షన్ ఎ÷–లాన్ ద్వారా ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు తవ్వే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రతి వర్షం చుక్కను కాపాడుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తాగునీటి



సరఫరా, సాగునీటి నిర్వహణ, పశు గ్రాసం, చెరువుల్లో నీటి నిల్వలు, ఇతర అత్యవసర చర్యలపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ వాటర్ పెంపునకు ఇంకుడు గుంతల తవ్వకం, రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్ ఫామ్ సాగు చేపట్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచాలని సమావేశంలో నిర్ణయించారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### ఆదం సంతోష్ కుమార్ డిమాండ్

### రాహుల్పై పోలీసుల చర్యను ఖండించిన ఆదాం

### ఆదాం ఆధ్వర్యంలో కాంగ్రెస్ శాంతియుత నిరసన ర్యాలీ

సికింద్రాబాద్, జూలై 23(ప్రజజ్యోతి):
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనకు సంఘీభావం తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తూ, సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సీతాఫల్మండి అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం వరకు సాగిన ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాహుల్ గాంధీ పై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలు దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయని అన్నారు. పేపర్ లీకేజీలకు కారణమైన అసలు సూత్రధారులను గుర్తించి ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకోకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. వైద్య విద్యలో ప్రవేశం కోసం







విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదువుతున్నారని, తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ ఇప్పిస్తున్నారని తెలిపారు. రాత్రింబవళ్లు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల జీవితాలతో కొందరు అక్రమాలకు పాల్పడుతూ చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షలు పదేపదే రద్దు కావడంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, తల్లిదండ్రులు ఆర్థికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రస్తావిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసులు బలప్రయోగం చేసి అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిపై ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను అమలు చేయాలని ఆదం సంతోష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాజేందర్ యాదవ్, శిల్పాచారి, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఘటనల పై కేంద్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967